
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

బుధవారం 18 డిసెంబరు 2024 | 5





ప్రశాంతంగా ముగిసిన డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు



అమలాపురం డీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన రాజులపూడి వెంకటేశ్వరరావును అభినందిస్తున్న నాయకులు

అమలాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల అధికారుల సమక్షంలో జరిగిన ఎన్నికల్లో నీటి సంఘాలకు చెందిన ప్రతినిధులు ఆయా డీసీ కమిటీలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. జిల్లాలో 15 డీసీ కమిటీలకు ఎన్నికలు జరిగాయి. అన్ని స్థానాల్లోను ఎన్డీయే కూటమికి చెందిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డీసీ కమిటీల ఎన్నిక పూర్తికావడంతో ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు జరగాల్సి ఉంది. సాగునీటి సంఘాల ఎన్నికలను వైసీపీ బహిష్కరిస్తున్నట్టు ప్రకటించడంతో అన్నిచోట్లా ఎన్డీఏ అభ్యర్థులు విజయ కేతనం ఎగురవేశారు. జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన కమిటీలు ఆయా ప్రాంతాల్లో విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

డిపార్టుమెంటల్ పరీక్షలకు రెండు కేంద్రాలు

అమలాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే డిపార్టుమెంటల్ పరీక్షలు-2024 కోసం జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఇన్‌చార్జి డీఆర్వో కె.మాధవి తెలిపారు. డీఆర్వో చాంబర్‌లో మంగళవారం డిపార్టుమెంటల్ పరీక్షల నిర్వహణ, సన్నద్ధతపై అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ నెల 18, 20 తేదీల్లో జరిగే పరీక్షకు భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల, చెయ్యేరులోని శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారన్నారు. ఆబ్జెక్టివ్ టైప్ సెక్షన్-1 పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారు. ఆబ్జెక్టివ్ టైప్ సెక్షన్-2 పరీక్షను మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్సు షాపులను మూసివేయించాలని సూచించారు. 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషనర్ సెక్షన్ సూపరింటెండెంట్ పి.గిరిజారాణి, ఉపతహశీల్దార్లు పలివెల అశోక్‌కుమార్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

అమలాపురం టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో వరికోతలు వాయిదా వేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ బాలసరస్వతి సూచించారు. కళ్లాల మీద ఉన్న ధాన్యాన్ని తడవకుండా కాపాడేందుకు అవసరమైన టార్పాలిన్లు అందించాలని, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి రైతులను అప్రమత్తం చేస్తూ కోతలు వాయిదా వేసుకునే విధంగా చైతన్యపరచాలన్నారు. తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో కోనసీమ జిల్లా కూడా ఉందని వాతావరణశాఖ ప్రకటించిందన్నారు. కళ్లాల్లో ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీలైనంత మేరకు సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సూచించారు. జిల్లాలో ఉన్న 371 రైతు సేవా కేంద్రాల ద్వారా 33,066 మంది రైతుల నుంచి 1.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటి వరకు సేకరించామన్నారు. ఆయా రైతులకు రూ.443 కోట్లు ధాన్యం సొమ్ము చెల్లించామని తెలిపారు.



అంతా సత్యం!

గత నెల 29న స్టెల్లా షిప్‌లో బియ్యం తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ (ఫైల్)

స్టెల్లా షిప్‌లో పట్టుబడ్డ రేషన్ బియ్యం

- అంతా సత్యం బాలాజీ కంపెనీదే
- 1320 మెట్రిక్ టన్నులు పట్టివేత
- ఛత్తీస్‌గఢ్ కంపెనీ పేరు
- జూలైలో పట్టుబడ్డ బియ్యం
- పాలిష్‌చేసి మళ్లీ ఎగుమతి
- గుట్టు తేల్చేపనిలో అధికారులు
- నిలిచిపోయిన బియ్యం లోడింగ్
- హైకోర్టులో వ్యాపారుల పిటిషన్
- నేటి నుంచి ముమ్మర దర్యాప్తు
- నౌకలో బియ్యం దించాలని ఆదేశం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

స్టెల్లా నౌకలో రేషన్ గుట్టు వీడింది.. విదేశాలకు తరలిపోవడానికి సిద్ధమైన పేదల బియ్యం లెక్కతేలింది. అధికారుల కళ్లుగప్పి.. చెక్ పోస్టులను మాయచేసి సముద్రాలను దాటించేయడానికి చూసిన బియ్యం స్మగ్లింగ్ దందా బయటపడింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 1,320 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేసి దేశాలు దాటించేయడానికి చూసిన అక్రమార్కుల పాపం పండింది. ఈ నేపథ్యంలో గుర్తించిన బియ్యాన్ని నౌక నుంచి కిందకు దించేయడానికి అధికారులు నిర్ణయించారు.అసలు ఈ బియ్యం సదరు సత్యం బాలాజీ కంపెనీకి ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై నేటి నుంచి దర్యాప్తు చేయబోతున్నారు. ఏ మిల్లుల నుంచి ఈ సరుకు వచ్చింది? ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సదరు సత్యం బాలాజీ కంపెనీకి ఇక్కడ సహకరిస్తున్నదెవరు అనే గుట్టులాగనున్నారు. నౌక నుంచి రేషన్‌బియ్యం దించేయాలని కలెక్టర్ ఆదేశించినప్పటికీ ప్రస్తుతం సముద్రంలో అల్లకల్లోల వాతావరణంతో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. మరోపక్క ఈ అన్‌లోడింగ్ పూరయ్యాకే మిగిలిన బియ్యాన్ని లోడ్‌చేసి పది రోజుల్లో స్టెల్లా కదలడానికి అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనున్నారు. ఇదిలా ఉంటే నౌకలోకి తమ పారాబాయిల్డ్ బియ్యం ఎగుమతికి అధికారులు అనుమతించడం లేదని కొందరు వ్యాపారులు కోర్టును ఆశ్రయించడం విశేషం.

స్టెల్లా కదిలేది అప్పుడేనా...

పనామా ఫ్లాగ్‌తో ఉన్న స్టెల్లా నౌక కాకినాడకు బియ్యం లోడింగ్‌కు వచ్చి 35రోజులుపైనే దాటుతోంది. ఇందులో రేషన్ బియ్యం లోడైన నేపథ్యంలో అదనపు తనిఖీలు, శాంపిళ్ల కోసం ఈ నౌకలోకి బియ్యం లోడింగ్‌ను అధికారులు నిలిపివేశారు. దీంతో అప్పటి నుంచీ ఈ నౌక కాకినాడలోనే ఉండిపోయింది. అయితే ఇప్పుడు శాంపిళ్ల ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో గుర్తించిన రేషన్ బియ్యాన్ని దించేయనున్నారు. ఈమేరకు పోర్టు అధికారులు కస్టమ్స్ విభాగంతో సంప్రదింపులు జరపగా బుధవారం నుంచి అన్‌లోడింగ్ ప్రక్రియ మొదలుపెట్టి రెండు రోజుల్లో సరుకంతా దించేయాలని భావించారు. తీరా అల్పపీడనం ప్రభావంతో మంగళవారం నుంచి సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్రంలోపల గంటకు 48 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తుండడంతో బుధవారం నుంచి అన్‌లోడింగ్ ప్రక్రియ సాధ్యం కాదని తేల్చేశారు. వాతావరణం సద్దుమణిగిన తర్వాత బియ్యం అన్‌లోడింగ్ చేయడం, ఇంకా మిగిలిన 12 వేల మెట్రిక్ టన్నులు నౌకలోకి లోడింగ్ చేయాల్సి ఉండడంతో ఈ ప్రక్రియ పూర్తికావడానికి దాదాపు రెండు వారాలకుపైగా సమయం పట్టే అవకాశం ఉంది. ఆ తర్వాతే కాకినాడ నుంచి స్టెల్లా నౌక కదలనుంది. కాగా స్టెల్లా నౌకలో రేషన్ బియ్యం ఉన్నాయనే కారణంతో ఈ నౌకలోకి తమ పారాబాయిల్డ్ బియ్యం ఎగుమతి చేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారంటూ మూడు బియ్యం ఎగుమతి కంపెనీలు హైకోర్టును ఆశ్రయించాయి. దీంతో హైకోర్టు విచారణలో భాగంగా నౌకలో బియ్యం లోడింగ్ జరగకుండా ప్రభుత్వానికి అడ్డుకునే అధికారాలు ఏమిటని న్యాయస్థానం మంగళవారం ప్రశ్నించింది. ఈ కేసును గురువారానికి వాయిదా వేసింది.

ఆ బియ్యం అవే..

కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి విదేశాలకు అక్రమంగా రేషన్ బియ్యం ఎగుమవుతున్నాయన్న వైనం మరోసారి పక్కా ఆధారాలతో బయటపడింది. ఈమేరకు స్టెల్లా షిప్‌లో అధికారులు డిసెంబరు 4న సేకరించిన 12 శాంపిళ్లు నిజాలను నిర్ధారించాయి. షిప్‌లో ఐదు హేచ్‌ల్లో లోడైన మొత్తం 32,416 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యంలో మూడో నెంబర్ హేచ్‌లో ఎగుమతికి సిద్ధం చేసిన పది వేల మెట్రిక్ టన్నుల సరుకులో రేషన్ బియ్యం ఆనవాళ్లు తేలాయి. ఈ బియ్యం అంతా సత్యం బాలాజీ కంపెనీదిగా అధికారులు గుర్తించారు. వాస్తవానికి స్టెల్లా నౌకలో రేషన్ బియ్యం ఎగుమతి జరుగుతుందనే సమాచారంతో గత నెల 29న డిప్యూటీ సీఎం పవన్ అక్కడకు వెళ్లి షిప్‌ను సీజ్ చేయాలని ఆదేశించారు. ఆ సమయానికి నౌక హేచ్-1లో 640 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్టు నిర్ధారించారు. అయితే మిగిలిన హేచ్‌ల్లో లోడైన బియ్యాన్ని కూడా తనిఖీ చేయాలని నిర్ణయించారు. ఈ ఏడాది జూలైలో పట్టుబడ్డ 42 వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని న్యాయస్థానం ఆదేశాలతో బ్యాంకు గ్యారంటీలు తీసుకుని వ్యాపారులకు తిరిగి అప్పగించేశారు. అయితే నౌకలో పట్టుబడ్డ బియ్యం.. అప్పట్లో వెనక్కు ఇచ్చేసిన బియ్యం ఒకటేనా అనే దానిపైనా శాంపిళ్లను సరిపోల్చగా మొత్తం బండారం బట్టబయలైంది. అప్పుడు వెనక్కు ఇచ్చేసిన బియ్యం, షిప్‌లో లోడైన బియ్యం ఒకటేనని ఎట్టకేలకు తేలింది. స్టెల్లా నౌకలో లోడైన 15 కంపెనీలకు చెందిన 32,416 మెట్రిక్ టన్నుల బియ్యంలో సత్యం బాలాజీ అనే కంపెనీకి చెందిన 10 వేల మెట్రిక్ టన్నుల్లో మొత్తం 1,320 మెట్రిక్ టన్నులు రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించారు. ఇందులో 640 మెట్రిక్ టన్నులు గతంలో గుర్తించిందే కాగా అదనంగా శాంపిళ్ల ద్వారా 680 మెట్రిక్ టన్నులు కొత్తగా రేషన్‌గా బయటపడింది. ఇదంతా నౌక నుంచి దించేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సత్యం బాలాజీ కంపెనీ కాకినాడ యాంకరేజ్‌పోర్టు ద్వారా రేషన్ బియ్యం ఎగుమతికి బరితెగించిందంటే అసలు ఇంత బియ్యం ఆ కంపెనీకి ఎలా వచ్చాయనేది విస్మయ పరుస్తోంది. ఈ బియ్యం అంతా కాకినాడ జిల్లాలో సేకరించినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు నేటి నుంచి దర్యాప్తు ముమ్మరం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ కంపెనీ తరపున బియ్యాన్ని షిప్‌లోకి ఎగుమతి చేస్తోన్న లోటస్ మెరైన్ లాజిస్టిక్స్ అనే షిప్పింగ్ కంపెనీ ప్రతినిధులను విచారించనున్నారు. మరో పక్క జులైలో పట్టుబడ్డ తమ రేషన్ బియ్యాన్ని సత్యం బాలాజీ కంపెనీ తిరిగి మిల్లుల్లో పాలిష్ చేసి ప్యాకింగ్ చేసి ఎగుమతి చేస్తోన్న నేపథ్యంలో ఇందుకు సహకరించిన మిల్లులపైనా గురి పెట్టనున్నారు. ఒకరకంగా చెప్పాలంటే సత్యం బాలాజీ రేషన్ అక్రమాల డొంక కదిల్చి పెద్దఎత్తున పీడీ కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. మిల్లుల బాగోతమూ బట్టబయలుకానుంది.

నేడు అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం


బర్మా కాలనీలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయం



రాజమహేంద్రవరంలో

బర్మా కాలనీ

ఆకలి,
ఆశ్రయం..ఈ రెండు మనిషిని ఎంత దూరమైనా తీసుకువెళ్తాయి..ఉన్న ప్రాంతంలో ఉండలేని పేద బతుకులు పొట్ట చేతపట్టుకుని ఎందాకైనా వెళ్తాయి.. ఇలా ఒక ఊరి నుంచి మరో ఊరు, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రం, ఒక దేశం నుంచి మరో దేశం...ఎక్కడ తమకు పని దొరికితే, ఎక్కడ తమ ఆకలి తీరితే అక్కడికి వలస వెళ్లిపోతారు.. అలా 60 ఏళ్ల క్రితం బర్మా దేశం నుంచి పొట్ట కూటి కోసం వలస వచ్చిన వారితో రాజమహేంద్రవరంలో ఓ కాలనీయే ఏర్పడింది..

ఆ పేరుతో ప్రత్యేక ప్రాంతం....
60 ఏళ్ల క్రితం స్పిన్నింగ్ మిల్లులో పనికి
అక్కడ నుంచి వచ్చిన కుటుంబాలు
కొందరు తిరిగి వెళ్లిపోగా..
ఇంకా కొందరు ఇక్కడే..

రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి): ఈ భూమి ఎవరికీ శాశ్వతం కాదు. బతుకుదెరువు కోసం ఉన్న ఊరిని వదిలి అనేక మంది ఇతర దేశాలకు, రాష్ట్రాలకు వెళ్లి అక్కడ స్థిరపడి జీవనం సాగిస్తున్నారు. పుట్టుక ఒక ప్రాంతంలో అయితే జీవితం మరొక ప్రాంతంలో ఉంటుంది. ఇలా మనిషి జీవన గమనంలో వలస కూడా ఓ భాగమైంది. 1966-1977లో రాజమహేంద్రవరం రూరల్ ప్రాంతంలో స్పిన్నింగ్ మిల్లును ఏర్పాటు చేశారు. ఈ మిల్లులో పని చేయడానికి మయన్మార్ (బర్మా) నుంచి 280 కుటుంబాలను తీసుకువచ్చారు. వారంతా రాజమహేంద్రవరంలో ప్రస్తుత బర్మా కాలనీలో ఉన్న ప్రాంతంలోను, క్వారీ సమీపంలోని మరొక ప్రాంతంలోను నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉండేవారు. అక్కడి నుంచి వారంతా స్పిన్నింగ్ మిల్లులో పనిచేసేందుకు వెళ్లేవారు. అదే విధంగా ఈ మిల్లులో పనిచేయడానికి సిలోను నుంచి కూడా చాలా మంది వచ్చి రాజమహేంద్రవరంలోనే స్థిరపడ్డారు. ఇలా బర్మా నుంచి వచ్చిన వారంతా రాజమహేంద్రవరంలోనే నివాసం ఉండటానికి అప్పట్లో క్వార్టర్లు కూడా నిర్మించారు. అవన్నీ ప్రస్తుతం కనుమరుగయ్యాయి. బర్మా నుంచి అప్పట్లో పెద్దవాళ్లు రావడంతో ఇక్కడకు వచ్చిన తర్వాతే పిల్లలు పుట్టడంతో వారంతా ఇక్కడే స్థిరపడిపోయారు. కొంతమంది బర్మాకు తిరిగి వెళ్లిపోయారు. అతి కొద్ది మంది మాత్రమే బర్మా కాలనీలో ఉండిపోయారు.

సంబంధాలు లేవు..

ప్రస్తుతం ఇక్కడ ఉన్నవారికి, బర్మాకు ఎటువంటి సంబంధాలు లేవు. అందరూ ఇక్కడి వారితో కలిసిపోయారు. తమ పూర్వీకులది బర్మా అని కూడా పూర్తిగా తెలియని పరిస్థితి. వారంతా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారుగా చెబుతారు. తొలినాళ్లలో బర్మా సంప్రదాయాలను వారు పాటించినప్పటికీ కాలక్రమేణా మారిపోయారు. కనీసం ఆ భాష తెలిసిన వారు కూడా లేరు. కానీ ఒకప్పటి బర్మా నుంచి 280 కుటుంబాలు మాత్రం రాజమహేంద్రవరం వచ్చి ఇక్కడే ఉండేవారని మాత్రం చెబుతారు. అందుకే బర్మాకాలనీకి ఈ పేరువచ్చింది. అదేవిధంగా క్వారీ రోడ్డులో కూడా వారు ఉండడంతో అక్కడ కూడా ఓ బర్మా కాలనీ ఉంది.

శ్రీలంక కూడా..

రాజమహేంద్రవరంలో లూథర్‌గిరి వెనుక ప్రాంతంలో క్వారీ గోతుల్లో నీటి మధ్యలో కొంత ప్రాంతంలో స్థానికులు గుడిసెలు వేసుకుని జీవనం సాగించేవారు. ఈ ప్రాంతం లంకను తలపించే విధంగా ఉండేదని దానిని శ్రీలంకగా నామకరణం చేసుకున్నారు. శ్రీలంకతో దీనికి ఎటువంటి సంబంధం లేకపోయినా పేరు మాత్రం పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో బిల్డింగ్‌లు వచ్చాయి, వర్షం పడితే ఇప్పటికీ ఈ ప్రాంతం చుట్టూ మునిగి లంక మాదిరిగా తయారవుతుంది..

తెలుగు సంప్రదాయాలు.. ఆచార వ్యవహారాలు

వలసదారులు వచ్చి స్థిరపడిన ప్రాంతాలకు ఆయా దేశాల పేర్లు పెట్టి స్థానిక ప్రజలే పిలవడంతో అప్పటి నుంచి ఆ పేర్లనే కొనసాగిస్తున్నారు. ఇక్కడ మిగిలిన పోయిన బర్మా వాసులు తెలుగు సంప్రదాయాలను, స్థానిక ఆచారాలను కొనసాగించడం ప్రారంభించారు. ఇప్పుడు పూర్తిగా తెలుగు వాళ్లలో కలిసిపోవడంతో పేరుకే బర్మా కాలనీ అయినా ఇక్కడ బర్మా నుంచి వచ్చిన వారెవరో, స్థానికులు ఎవరో తెలిసే పరిస్థితి ఉండదు. అలాగే చాలా ఏళ్ల క్రితం నుంచి స్థానికంగానే పెళ్లి సంబంధాలు కూడా కుదుర్చుకోవడంతో అంతా ఒక్కటిగానే కలిసి మెలిసి ఉంటున్నారు.





రాజమహేంద్రవరం అర్బన్, (ఆంధ్రజ్యోతి):

హక్కులు ఉన్నాయి కానీ అమలే జరగడం లేదని మైనార్టీల ఆవేదన
ప్రభుత్వాలు పట్టించుకోవాలని వేడుకోలు..

మైనార్టీల్లో ప్రధానమైన ముస్లింలు, క్రిస్టియన్లు, జైనులు, సిక్కులు, పార్శీలు వంటి ఎందరో మన సమాజంలో ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం ముస్లింలు, క్రిస్టియన్లు కావడంతో వారి హక్కులకు సంబంధించి ఆయా వర్గాల నుంచి కొన్ని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదనే ఆవేదన వారిలో ఉంది.

- నేడు మైనార్టీల హక్కుల దినోత్సవం

మన దేశంలో అత్యధిక సంఖ్యలో హిందువులు ఉన్నారు..మిగిలిన మతాలకు చెందిన వారు మైనార్టీలుగా ఉన్నారు. రాజ్యాంగపరంగా దేశంలో ప్రతి పౌరుడికి సమాన హక్కులు ఉన్నప్పటికీ మైనార్టీల రక్షణకు కొన్ని ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. అయితే మైనార్టీల హక్కులను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే ఆవేదన ఆయా వర్గాల్లో వ్యక్తమవుతోంది.



మా హక్కుల మాటేంటి?

ముస్లింల మాటిది..

ముస్లిం మైనార్టీలకు సంబంధించి వారిని రెండు రకాలుగా చెబుతున్నారు. భాషా పరమైన మైనార్టీలు, మత పరమైన మైనార్టీలుగా ఉన్నారు. ఆర్టికల్ 2 ప్రకారం మైనార్టీల హక్కులకు ప్రాంతీయ, జాతీయ, భాష, రంగు, మతం, ఆస్తి వంటివి ఆధారంగా వివక్ష ఉండకూడదు. అలాగే ఆర్టికల్ 27 ప్రకారం రెలీజియస్ పరంగా మైనార్టీలను రక్షించడానికి ఒక చట్టం ఉంది. కానీ ఇవి అంతంతమాత్రమే తప్ప సరిగా అమలు జరగడం లేదనే అభిప్రాయం వారిలో వ్యక్తమవుతోంది. దీంతోపాటు మైనార్టీలపై వివక్ష ఎక్కువైందనే భావన ఉంది.. ప్రధానంగా బలహీనమైన ముస్లిం మైనార్టీ వర్గం నూర్ బాషా దూదేకుల వర్గం మరీ వివక్షకు గురవుతోందని ఆ వర్గానికి చెందిన నాయకులు వాపోతున్నారు. ముస్లింలంతా విద్య, ఉపాధి, ఆరోగ్య సంరక్షణలో సమానత్వం కోరుకుంటున్నారు. దీంతో పాటు కలెక్టర్ ప్రతి నెలా రివ్యూ సమావేశం పెట్టి వారి సాధక బాధకాలు వినాల్సి ఉందని, కానీ కొన్నేళ్లుగా ఇది జరగడంలేదని అంటున్నారు. ప్రభుత్వానికి ముస్లిం సమాజం సమస్యలు తెలియజేయాలి, ఆర్థిక, సామాజిక ఇబ్బందులపై సమీక్ష జరపాలి. ప్రతి నెలా ప్రభుత్వానికి ఒక రిపోర్టు ఇవ్వాలి. దీన్ని పునరుద్ధరించాలి అని ఆయా వర్గాలు కోరుతున్నాయి.

రిజర్వేషన్లు పెంచాలని..

క్రిస్టియన్లలో దళిత క్రిస్టియన్లు బీసీ సీ కేటగిరీలోకి రావడంతో వారికి 1 శాతం రిజర్వేషన్లు మాత్రమే వర్తిస్తున్నాయి. దీనివల్ల ప్రయోజనం చాలా తక్కువ అనేది వారి భావన. దళిత క్రిస్టియన్లకు బీసీ సీ హోదా ఇవ్వడంతో చాలా మంది విద్య, ఆర్థికపరమైన వాటిల్లో వెనుకబడి ఉంటున్నారని చెబుతున్నారు. దళిత క్రిస్టియన్లకు 5 శాతం వరకూ రిజర్వేషన్లు పెంచితే ప్రయోజనం ఉంటుందని, తమ హక్కులకు రక్షణ లభిస్తుందని భావిస్తున్నారు. గతంలో క్రిస్టియన్ మైనార్టీ వైద్య, విద్యా సంస్థలకు ప్రభుత్వాలు గ్రాంటు ఇచ్చేవి. కొన్నేళ్ల క్రితం గ్రాంట్ ఇన్ ఎయిడ్ పోస్టులు తీసేయడం తమకు ఇబ్బందికరంగా మారిందని వారు చెబుతున్నారు.



5 శాతం రిజర్వేషన్లు పెంచాలి



మైనార్టీ స్కూళ్లలో ఎయిడెడ్ పోస్టులు ఉండేవి. ఇప్పుడు వాటిల్లో పోస్టులను ఎత్తేశారు. మళ్లీ పునరుద్ధరించాలి. దళిత క్రిస్టియన్లకు బీసీ సీ హోదా ఇవ్వడంతో తమ హక్కులకు భంగం వాటిల్లుతోంది. ఐదు శాతం రిజర్వేషన్లు పెంచాలి. ఉపాధి అవకాశాలు కల్పించాలి..

పి.ఎర్నెస్ట్ మోజెస్, పాస్టర్స్ ఫెలోషిప్ రీజియన్ చైర్మన్

సమాన అవకాశాలు కల్పించాలి



ముస్లిం జనాభా దామాషా ప్రకారం ఉపాధి అవకాశాలు కల్పించాలి. విద్యలో ప్రోత్సాహం ఉండాలి. రిజర్వేషన్లు 8 శాతం లేదా 10 శాతం పెంచి సమాన అవకాశాలు కల్పించాలి. ఇస్లామిక్ బ్యాంకులు పెట్టాలి. వడ్డీలు లేని రుణాలు అందజేయాలి. **షేక్ సుభాన్, నూర్ బాషా సంఘం**

నటనలో ఎదిగి... పాత్రల్లో ఒదిగి...

తెలుగుచిత్ర పరిశ్రమలో గయ్యాళి పాత్ర, అత్త పాత్ర, తల్లి పాత్రల్లో ఇమిడిపోయి ఆ పాత్రలకే ప్రాణం పోసిన మహానటి సూర్యకాంతం. ఆమె పాత్రల్లో కనిపించే గాంభీర్యం, పాత తరం నాటి ముచ్చట్లెన్నో ఆయా సినిమాల్లో కనిపిస్తాయి. ఆమె నటించిన సినిమా పాత్రల వల్ల సూర్యకాంతం అనే పేరు పెట్టుకునేందుకు చాలామంది వెనకడుగు వేసేవారంటే ఆమె వేసిన పాత్రలు ఎంత బలమైన ప్రభావం చూపించాయో అర్థం చేసుకోవచ్చు. అలాంటి సహజ నటి సూర్యకాంతం జన్మించింది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ సమీపంలోని వెంకట కృష్ణరాయపురంలోనే. ఆమె వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం..



నటనలో ఓ చరిత్ర సూర్యకాంతం
750 చిత్రాల్లో నటించి అనేక పాత్రలకు జీవం పోసిన నటి
కాకినాడ సమీపంలోని వెంకటకృష్ణరాయపురం సొంతూరు.... నేడు ఆమె వర్ధంతి



(ఆంధ్రజ్యోతి-మండపేట)

సూర్యకాంతం కాకినాడ సమీపంలోని వెంకటకృష్ణరాయపురంలో 1924 అక్టోబరు 28న పొన్నాడ వెంకటరత్నమ్మ-అనంతరామయ్య దంపతులకు 14వ సంతానంగా జన్మించారు. సరైన వైద్య సదుపాయాలు లేని కారణంగా పుట్టినవారిలో పది మంది మరణించారు. దీంతో ఈ 14 మందిలో మిగిలింది నలుగురే. వీరిలో చివరి సంతానం సూర్యకాంతం. చిన్నతనం నుంచి సూర్యకాంతం కుటుంబంలో గారాబంగా పెరిగారు. చిన్నతనం నుంచి నటన, సంగీతం మీద ఆసక్తి ఉండేది. పైగా నవలలు అధికంగా చదివేవారు. అమె తొలి నుంచి గడసరి. చిన్నతనంలోనే అంటే 8వ తరగతి చదువుతుండగా తండ్రి చనిపోయారు. ఇక పాఠశాలలో వార్షికోత్సవ సందర్భాల్లో సూర్యకాంతం నాటకాల్లో నటించారు. పాటలు పాడటం ఇష్టం. కాకినాడలో బాలాంత్రపు ప్రభాకర రావు హనుమాన్ నాటక మండలి పేరిట కేవలం అడపిల్లలతోనే వేసే సతీసక్కుబాయి, చింతామణి, శ్రీకృష్ణతులాభారం వంటి అనేక నాటకాల్లో ఆమె వేషాలు వేశారు. అలా రంగస్థలంలో మంచిపేరు తెచ్చుకున్నారు. 1945లో జెమిని సంస్థ చంద్రలేఖ చిత్రాన్ని భారీ తారాగణంతో తమిళం, హిందీ భాషల్లో నిర్మిం చే సమయంలో నటన మీద ఆసక్తి ఉన్న కళాకారులను, నృత్యకళాకారులను పత్రికాముఖంగా అహ్వానించారు. ఆ ప్రకటన చూసిన హనుమాన్‌నాట్యమండలి సభ్యులు దాసరి సుభద్ర, యండమూరి సుభద్ర మద్రాసుకు వెళుతూ సూర్యాకాంతాన్ని కూడా వెంట తీసుకువెళ్లారు. వారితో కలిసి వెళ్లిన సూర్యకాంతం మద్రాసు జెమిని స్టూడియోలో డ్యాన్సర్‌గా నెలవారి జీతానికి చేరి అలా చంద్రలేఖలో సినిమాలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన డ్రమ్‌డాన్స్ సన్నివేశంలో సూర్యకాంతం 500 మందితో కలిసి పాల్గొన్నారు. తొలి నుంచి ఆమెకు హిందీ చిత్రంలో నటించాలనే కోరుకుండేది. జెమిని స్టూడియోలో హిందీ సినిమాలు ఎక్కువగా నిర్మించేవారు. గాయని పి. లీలతో పరిచయమైన సూర్యకాంతం ఆ తర్వాత 1946లో పి.పుల్లయ్య దర్శకత్వం వహించిన నారదనారది చిత్రంలో చిన్నపాత్రలో నటించింది. దాంతో ఆమె జెమిని సంస్థలో నెలవారీ జీతానికి కాంట్రాక్టు వద్ద పనిచేసే సూర్యకాంతం ఆందులో నుంచి మానేసి 1946లో సారధి స్టూడియో ఎల్వీ ప్రసాద్ దర్శకత్వంలో నిర్మించిన గృహప్రవేశం చిత్రంలో మూగపిల్ల పాత్ర వేసింది. అలాగే 1950లో నిర్మించిన సాధన వారు నిర్మించిన సంసారం చిత్రంలో రేలంగి తల్లిగా నిర్దయ కలిగిన అత్త పాత్రలో తొలిసారి సూర్యకాంతం నటించింది. కేవలం 25 ఏళ్ల వయస్సులో ఆమె 60 ఏళ్ల అత్త పాత్రలో నటించింది. సూర్యకాంతానికి 1950వ సంవత్సరంలో పెద్దిభొట్ల చలపతిరావుతో వివాహం జరిగింది. ఆయన మద్రాసులో న్యాయవాది. ఆయనకు సూర్యకాంతం నాటకాల సమయంలో పరిచయమైంది. 1951లో రాజేశ్వరి ఫిలిమ్స్ కంపెనీ అధినేత, నిర్మాత కేబీ నాగభూషణం నిర్మించిన సౌదామిని చిత్రంలో సూర్యకాంతం హీరోయిన్ పాత్రకు ఎంపికయ్యారు. అప్పటిలో దురదృష్టవశాత్తూ ఆమె కారు ప్రమాదంలో గాయపడడంతో ఆ పాత్రకు వరలక్ష్మిని ఎంపిక చేశారు. ఆ తర్వాత ఎక్కువగా తెలుగు సినిమాల్లో అత్త, తల్లి గయ్యాళి పాత్రలను పోషించారు. పెళ్లిచేసి చూడు, గుండమ్మకథ మాయాబజార్, తోడికోడళ్లు, అప్పుచేసిపప్పు కూడు, వెలుగునీడలు, ఇద్దరు మిత్రులు, ఆత్మబంధువు, కులగోత్రాలు, దాగుడుమూతలు, చిరంజీవులు, కన్యాశుల్కం వంటి చిత్రాల్లో వైవిధ్య పాత్రలను ఆమె పోషించారు. తాము నిర్మించే చిత్రాల్లో సూర్యకాంతం పాత్ర ఉందా లేదా అని నిర్మాతలు దర్శకుడిని అడిగేవారంటే సూర్యకాంతం నటన గురించి అర్థం చేసుకోవచ్చు. సూర్యకాంతం జీవితంలో గుండమ్మకథ చిత్రం ఒక మైలురాయిగా చెప్పవచ్చు. ఆమె సినిమాలో గయ్యాళే తప్ప నిజజీవితంలో దయ, దాణగుణం కలిగి ఉండేది. ఎందరో అనాథ పిల్లలకు, విద్యా సంస్థలకు, అనాథలకు, గ్రంథాలయాలకు అర్థికసాయం చేసేది. చిన్నతనంలోనే ఆమె చదువుకు స్వస్తిచెప్పి సినిమాల్లో నటించారు. ఆమె 50 తమిళ చిత్రాల్లో నటించారు. ఐదు బాషల్లో మాట్లాడేది. మొత్తం 750 చిత్రాల్లో నటించారు.

ఆమెకు చివరి దశలో తిరుపతి శ్రీవేంకటేశ్వర మహిళా విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేట్ అందించి సత్కరించారు. ఆమె మంచి వ్యాపారవేత్తగా కూడా రాణించారు. పాత ఇళ్లను కొనుగోలు చేసి వాటిని ఆధునీకీకరించి మంచి ధరకు విక్రయించేవారని చెబుతారు. 1993లో ఆమె షుగర్ వ్యాధితో బాధపడుతూ మూత్రపిండాలు దెబ్బతినడంతో 1994 డిసెంబరు 18న మరణించారు. ఆమె తన 70వ ఏట కన్నుమూశారు. ఆమె లేకపోయినా అలనాటి పాతకాలపు సినిమాల్లో వేసిన పాత్రలు నేటికీ సజీవంగానే మనకు కనిపిస్తున్నాయి.


సామర్లకోటలో టిడ్కో లబ్ధిదారులతో మాట్లాడుతున్న చైర్మన్ అజయ్‌కుమార్

'టిడ్కో గృహాలను నిర్లక్ష్యం చేసిన వైసీపీ'

పెద్దాపురం/సామర్లకోట డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం శివారు వాలుతిమ్మాపురం సమీపంలో నిర్మించిన టిడ్కో గృహాలను, సామర్లకోటలోని గృహాలను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ టిడ్కో గృహాలను గత వైసీపీ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా నిర్వీర్యం చేసిందన్నారు. లబ్ధిదారులకు, బ్యాంకర్లకు మధ్య ఉన్న సమస్యల పరిష్కారానికి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తున్నట్టు పేర్కొన్నారు. టిడ్కో గృహాల్లో నివాసముంటున్న ప్రజల సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. టిడ్కో గృహాలు నివాస యోగ్యంగా ఉన్నాయా లేదా అనేదానిపై సాంకేతిక నిపుణుల బృందంతో కమిటీని వేశామన్నారు. గృహ సముదాయల వద్ద పూర్తిస్థాయిలో అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలువురు కాలనీ వాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసురావడంతో వాటిని సాధ్యమైనంత తొందర్లో పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో 'కౌడా' చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, టిడ్కో అధికారులు పాల్గొన్నారు.


మోతుగూడెంలో ఉదయం తొమ్మిది గంటలైనా వీడని మంచు


చలి మంట కాగుతున్న గిరిజనులు

మంచు దుప్పటి...

మోతుగూడెం/రాజవొమ్మంగి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు గ్రామాలను పొగ మంచు దట్టంగా కమ్మేసింది. చింతూరు మండలం మోతుగూడెంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల వరకు భానుడు కనిపించలేదు. దీంతో వాహనచోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. చలి తీవ్రతకు గిరిజనులు వణుకుతున్నారు. మంట వేసుకుని చలి నుంచి రక్షణ పొందుతున్నారు. మరోవైపు రాజవొమ్మంగిలోనూ మంచుదుప్పటి పరుచుకుంది. శివాలయం కొండపై నుంచి చూస్తే గ్రామం మొత్తం మంచు తెరల్లో ఉన్నట్టు కనిపించింది.

రాళ్లకట్టు... జారేట్టు!

సామన్యుడైనా, సంపన్నుడైనా... అధికారి అయినా, ప్రజాప్రతినిధి అయినా.... ఎవరైతే నాకేంటి అంటూ వెక్కిరిస్తోంది ఈ గొయ్యి. కాకినాడ జిల్లా రౌతులపూడి శివారు రాళ్లకట్టు సమీపంలో ఉంది ఇది. ఐదు రోజుల క్రితం ఓ స్కూలు బస్సు, రెండు రోజుల క్రితం ఒక ఆటో ఇదే ప్రదేశంలో తిరగబడ్డాయి. మంగళవారం రౌతులపూడి మండలంలోని ఉప్పంపాలెంలో రెవెన్యూ సదస్సుకు వెళ్తున్న డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు వాహనం కూడా ఈ గోతిలో దిగబడిపోయింది. కొందరు వ్యక్తులు దిగి తోశారు.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి)



పోలీసులపై ఎటాక్ చేసిన

దొంగ నోట్ల ముఠా అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ అల్లూరి వెంకట సుబ్బరాజు

- పోలీసుల అదుపులో 13 మంది
- నిందితులు రాజమహేంద్రవరం, భీమవరం వాసులే
- పరారీలో ఐదుగురు
- స్విఫ్ట్ కారు, నాలుగు బైక్‌లు స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తప్పించుకుందామని పోలీసులపై ఎటాక్ చేస్తే అసలు డొంక కదిలింది.. భీమవరం కేంద్రంగా సాగుతున్న పెద్ద దొంగ నోట్ల ముఠా బయటపడింది. రాజమహేంద్రవరంలో ఈ నెల 12న అర్ధరాత్రి శ్రీకాకుళం పోలీసులపై ఎటాక్ చేసి దొంగ నోట్ల కేసులో నిందితుడు రాపాక ప్రభాకర్ అలియాస్ ప్రతాప్ రెడ్డిని తీసుకు పోయారు. ఈ సంఘటన సంచలనంగా మారింది. పోలీసులపై ఎటాక్ చేసి నిందితుడిని ఎత్తుకుపోవడంపై ఆశ్చర్యానికి లోనయ్యారు. ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. మొత్తం 18 మంది పోలీసులపై ఎటాక్ చేసి అదుపులో ఉన్న నిందితుడిని ఎత్తుకుపోయినట్టు గుర్తించారు. అనంతరం తీగలాగితే దొంగనోట్ల ముఠా గుట్టు బయటపడింది. వారిలో 13 మందిని ప్రకాష్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజమహేంద్రవరం మహిళా పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం విలేకరులకు అడిషనల్ ఎస్పీ అల్లూరి వెంకట సుబ్బరాజు, సెంట్రల్ జోన్ డీఎస్పీ కే.రమేష్ బాబు, ప్రకాష్‌నగర్ సీఐ బాజీలాల్ వివరాలు వెల్లడించారు.

అసలు ఏం జరిగిందంటే...

శ్రీకాకుళం జిల్లా సిగడం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితుడిగా ఉన్న రాపాక ప్రభాకర్ అలియాస్ ప్రతాప్ రెడ్డిని ఈనెల 12న రాత్రి పోలీసులు భీమవరంలో అరెస్టు చేశారు. ఇదే కేసులో రెండో నిందితుడిగా ఉన్న కృష్ణమూర్తి కోసం రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌టవర్ లోకేషన్ వెరిఫై చేయడానికి వచ్చారు. శ్రీకాకుళం పోలీసులు ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్‌కి వచ్చి తిరిగి ప్రభాకర్‌ను తీసుకుని వెళ్లిపోతుండగా రాజమహేంద్రవరం ఆర్‌టీసీ కాంప్లెక్స్ రోడ్డు వీఎల్‌పురం సర్కిల్ లిమిట్స్‌లో కొంతమంది రెండు కార్లు, నాలుగు బైక్‌లపై వచ్చి పోలీసులపై ఎటాక్ చేసి రాపాక ప్రభాకర్‌ను తీసుకుని వెళ్లిపోయారు. దీనిపై అదే రోజు రాత్రి ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ బాజీలాల్ కేసు నమోదు చేశారు. పోలీస్‌లపై ఎటాక్ చేసిన ముఠా ఆచూకీ కోసం ఆరు బృందాలను రంగంలోకి దింపి విస్తృతంగా గాలించారు. ఎటాక్ చేసినవారంతా దొంగనోట్ల ముఠాకు చెందిన వారని గుర్తించి అరెస్టు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం దెయ్యాలతిప్పకు చెందిన నల్లి శశికాంత్, బ్రిడ్జిపేట గునుపూడికి చెందిన పోతుల యాపేతు అలియాస్ వినోద్, గునుపూడి అంబేడ్కర్ నగర్‌కు చెందిన తాళ్ళ జాన్సన్ రాజు, బ్రిడ్జిపేటకు చెందిన పెద్దపాటి మహంకాళి, నేతపూడి క్రాంతి కుమార్, మొగల్తూరు మండలం కవురు వారిపాలెం అంబేడ్కర్ కాలనీకి చెందిన గండుపల్లి కామరాజు, రాజమహేంద్రవరం నెహ్రూనగర్‌కు చెందిన గెద్దాడ శ్రీనాథ్, వై.జంక్షన్ సుబ్బారావు పేటకు చెందిన తురుబిల్లి రామసతీష్, తాడితోటకు చెందిన బుంగా తేజ అలియాస్ ఏలియా, గాంధీపురానికి చెందిన ఇడిసిమళ్ళ సతీష్, ఏవీఏ రోడ్డుకు చెందిన బాలుడు, బుచ్చియ్యపేటకు చెందిన పీతల చిరంజీవి, లక్ష్మీవారపుపేటకు చెందిన నక్కా వెంకట దుర్గా శ్రీఅఖిల్‌లను అరెస్టు చేశామన్నారు. వారితో పాటు స్విఫ్ట్ కారు, 4 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ కేసులో ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు. చాలాకాలంగా వారంతా ముఠాగా ఏర్పడి దొంగ నోట్లు మారుస్తున్నట్టు సమాచారం. దీనిలో భాగంగా భీమవరంలో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకున్న వెంటనే అటు భీమవరం ముఠా.. ఇటు రాజమహేంద్రవరం ముఠా రంగంలోకి దిగి నిందితుడిని తీసుకెళ్లిపోయారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్ బాబు పర్యవేక్షణలో కేసును ఛేదించిన సీఐ బాజీలాల్, ఎస్ఐ శివప్రసాద్, హెడ్‌కానిస్టేబుళ్లు ఎస్. వెంకట్రావు, సీహెచ్.శ్రీనివాసరావు, క్రైమ్ కానిస్టేబుల్ ఎస్.వీరబాబు, వి.నాగరాజు, టి.వరహాల బాబు, బి.రాజబాబును ఎస్పీ నరసింహకిషోర్ ప్రత్యేకంగా అభినందించారని అడిషనల్ ఎస్పీ తెలిపారు.

ఆరుగురు రాజమహేంద్రవరం వారే...

దొంగ నోట్ల ముఠా కేసులో నిందితుడిని తప్పించేందుకు శ్రీకాకుళం పోలీస్‌లపై ఎటాక్ చేసిన వారిలో ఆరుగురు రాజమహేంద్రవరానికి చెందిన వారే కావడం విస్మయానికి గురిచేస్తుంది. వారంతా 19 నుంచి 32 ఏళ్ల వారే.

కొట్టి... చీరతో చేతులు కట్టి!

దూబచర్లలో దోపిడీ దొంగల బీభత్సం

24 గ్రాముల బంగారం, రూ.30వేల నగదు చోరీ

నల్లజర్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలో మంగళవారం తెల్లవారుజామున దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించి 24 గ్రాముల బంగారం, రూ.30వేల నగదు దోచుకెళ్లారు. స్థానికుల వివరాల ప్రకారం.. దూబచర్ల గ్రామానికి చెందిన విశ్రాంత వ్యవసాధికారి చీమకుర్తి వీరభద్ర అప్పల కృష్ణమూర్తి తన భార్య లక్ష్మీకుమారితో కలిసి పాత ఇండియన్ బ్యాంకు ఉన్న ఇంట్లో జీవిస్తున్నారు. లక్ష్మీకుమారి అనారోగ్యంతో మంచంపైనే ఉంటున్నారు. ఆమెకు సహాయకురాలిగా అదే గ్రామానికి చెందిన జుత్తింగ పెద్దింట్లను నియమించుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు కృష్ణమూర్తి ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అక్కడే ఉన్న పెద్దింట్ల.. ఎవరు అంటూ ప్రశ్నించేలోగా ఆమెను కొట్టి చీరతో చేతులు కట్టేశారు. ఆపై కృష్ణమూర్తి చేతులను సైతం తాళ్లతో కట్టి బంధించి లక్ష్మీకుమారి మెడలో బంగారు ఆభరణాలతోపాటు బీరువా పగులగొట్టి ఆభరణాలు, రూ.30 వేల నగదు దోచుకుని వెళ్లిపోయారు. సంఘటన నుంచి తేరుకున్న కృష్ణమూర్తి 112కి కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీ దేవకుమార్, దేవరపల్లి సీఐ బీన్ నాయక్, ఎస్ఐ సోమరాజు, రమేష్, బాలాజీ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వేలిముద్రలు సేకరించి, డ్యాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ సుబ్బరాజు



అనారోగ్యంతో మంచంపై ఉన్న లక్ష్మీకుమారి

కాపురానికి రానివ్వకుండా వేధింపులు

భర్త ఇంటి ముందు మహిళ నిరసన దీక్ష



కొమరాజులంకలో దీక్ష చేపట్టిన బాధితురాలు

రావులపాలెం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న తరుణంలో అత్తింటివారు కాపురానికి రానివ్వకుండా వేధిస్తున్నారని తమకు న్యాయం చేయాలంటూ ఓ వివాహిత భర్త ఇంటి ముందు నిరసన దీక్ష చేపట్టింది. యువతి, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం కొమరాజులంకకు చెందిన గంగ్రోతు హరికృష్ణ, యామన ఝాన్సీ 6 నెలల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అత్తారింటికి వెళ్లగా అత్త గంగ్రోతు వెంకటలక్ష్మి, మావయ్య సత్తిపండులు ఝాన్సీ మెడలో తాళి తెంపి మీది వేరే కులం, మాది వేరే కులం నువ్వు కాపురానికి ఎలా వస్తావంటూ కొట్టి దుర్భాషలాడారు. దీంతో మనస్తాపానికి చెందిన బాధితురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను స్థానిక ప్రవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడంతో ప్రాణాలతో బయటపడింది. కాగా కాపురానికి తీసుకుని వెళ్లాలని ఎన్నిసార్లు వేడుకున్నా, పెద్ద మనుషులతో మాట్లాడించినా ఎటు వంటి స్పందన లేకపోవడంతో ఝాన్సీ తనకు న్యాయం చేయాలంటూ మంగళవారం భర్త గంగ్రోతు హరికృష్ణ ఇంటి ముందు నిరసన దీక్ష చేపట్టింది. తనకు న్యాయం జరిగే వరకూ దీక్ష కొనసాగిస్తానని పేర్కొంది. బాధితురాలికి అండగా పలువురు మహిళలు చేరుకుని ఝాన్సీని కాపురానికి తీసుకుని వెళ్లాలంటూ నినాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ చంటి సిబ్బందితో అక్కడికి వెళ్లి వారితో చర్చించారు. తనకు న్యాయం జరగాలని శాంతియుతంగా దీక్ష చేస్తున్నానని న్యాయం జరిగే వరకూ కొనసాగిస్తానని ఝాన్సీ తెలిపింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం

బాధితురాలకు అన్ని విధాలా న్యాయం జరిగే వరకూ అండగా నిలబడి పోరాడతామని రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు మట్టా వీరబాబుగౌడ్ అన్నారు. బాధితురాలి దీక్ష వద్దకు ఆయన చేరుకని అండగా నిలబడ్డారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గంగ్రోతు హరికృష్ణ ఝాన్సీని పెళ్లి చేసుకుని కాపురానికి తీసుకెళ్లకపోవడం దారుణమన్నారు. అత్తమామలు ఆమెపై చేసిన దాడిని ఖండిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ దృష్టికి విషయాన్ని తీసుకుని న్యాయం జరిగేలా పోరాటం చేస్తామన్నారు.

లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు

ఐదుగురికి గాయాలు

తేటగుంట హైవేపై ఘటన

తుని రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం లారీని ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటన ఉలికిపాటుకు గురిచేసింది. కాకినాడ జిల్లాలో ఓ ట్రావెల్ బస్సు నిర్వాహకుడు కాశీ యాత్ర కోసం ప్రయాణికులను ఎక్కించుకుని బయలుదేరారు. అన్నవరం దేవస్థానం వద్ద దర్శనం అనంతరం సింహాచలం వెళ్లేందుకు పయమై ఐదుకిలోమీటర్లు వెళ్లేసరికి ప్రమాదం జరిగింది. తేటగుంట వద్ద లారీ ఎదురుగా ఉన్న హైవే వ్యాన్‌ని ఢీకొనగా అదే లారీని టూరిస్ట్ బస్సు వెనుక నుంచి ఢీకొంది. భారీ శబ్దంతో పాటు కేకలు వినిపించడంతో స్థానికులు గుమిగూడారు. అప్పటికే బస్సులో చెల్లాచెదురుగా పడి ఉన్న ప్రయాణికులను ఎమర్జెన్సీ విండో ద్వారా బయటకు తీసుకొచ్చేందుకు పోలీసులు, హైవే మెయిన్ సిబ్బంది శ్రమించారు. బస్సులో 36 మంది ప్రయాణికులు ఉండగా ఐదుగురికి గాయాలవగా మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వెంకట్రావు, హేమా, సత్యవతి, శ్రీరాములు, పార్వతిలను హైవే అంబులెన్స్ సహాయంతో ఏరియా ఆసుపత్రికి తరలించి పోలీసులు వైద్యం అందించారు. ఘటనపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు.



బస్సులో ఇరుక్కున్నవారిని బయటకుతీస్తున్న దృశ్యం



గాయాలపాలైన ప్రయాణికులు

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

కడియం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తన భార్యను కత్తితో నరికి, ఆమెతో సన్నిహితంగా ఉన్న వ్యక్తిని నరికి చంపిన కేసులో తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరితోటకు చెందిన పీతాని సత్యనారాయణకు సెక్షన్ 302 కింద జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా, సెక్షన్ 307 కింద 7 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 9వ అదనపు సెషన్ జడ్జి ఎం.మాధురి తీర్పు నిచ్చారు. సీఐ ఎ.వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం.. వేమగిరి తోటకు చెందిన పీతాని సత్యనారాయణ తన భార్య భవానీ అదే గ్రామానికి చెందిన బొంతు వెంకన్నతో కలిసి ఉండడాన్ని చూసి వివాహేతర సంబంధం ఉందని భావించి ఇద్దరినీ కత్తితో నరికాడు. వెంకన్న అక్కడికక్కడే మరణించగా భవానీకి గాయమైంది. వెంకన్న సోదరుడి ఫిర్యాదుతో అప్పటి సీఐ కె.శ్రీధర్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా వాదోపవాదాల అనంతరం జడ్జి ఎం.మాధురి నిందితుడికి సెక్షన్ 302 కింద జీవితఖైదు, రూ.10 వేల జరిమానా, సెక్షన్ 307 కింద ఏడేళ్ల జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 9 నెలలు జైలుశిక్ష విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ వీవీఎస్‌బీ రాజు వాదనలు వినిపించారు.

దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం చేసిన

ఫీల్డ్ అసిస్టెంట్‌కు 14 రోజుల రిమాండ్

కరప, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి కాకినాడ కోర్టుకు తరలించగా మెజిస్ట్రేట్ 14రోజుల రిమాండ్ విధించినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు. కాకినాడ జిల్లా కరప మండలం వేములవాడకు చెందిన దివ్యాంగురాలిపై అదే గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మట్టపర్తి వీరబాబు ఈనెల 11న రాత్రి అత్యాచారయత్నం చేసి పరారైన విషయం పాఠకులకు తెలిసిందే. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కరప పోలీసులు మంగళవారం నిందితుడిని అరెస్ట్‌చేసి కోర్టుకు హాజరుపరచగా మెజిస్ట్రేట్ ఆదేశాలతో సబ్‌జైలుకు తరలించారు.

అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో

సత్తా చాటిన నాగబాబు

3 బంగారు పతకాలను సాధించిన కరప సబ్‌యూనిట్ మలేరియా అధికారి



3 బంగారు పతకాలు, సర్టిఫికెట్లతో నాగబాబు

కరప, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గుడివాడలో జరిగిన 44వ రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో కాకినాడ జిల్లా కరప సబ్‌యూనిట్ మలేరియా అధికారి యాతం నాగబాబు సత్తా చాటి మూడు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. గుడివాడ ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియంలో ఈనెల 14నుంచి రెండు రోజుల పాటు పరుగు పందెం పోటీలు జరిగాయి. 200మీటర్లు, 400మీటర్లు, 800మీటర్లు పరుగుపందెంలో వరుసగా మొదటి స్థానాలు సాధించి బంగారు పతకాలను గెలుచుకున్నారు. ఈ క్రమంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 6 నుంచి 8వ తేదీ వరకు రాజస్థాన్‌లోని ఆళ్వార్ వద్ద జరిగే 44వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు నాగబాబు ఎంపిక య్యారు. 2013 నుంచి ఇప్పటివరకు జరిగిన వివిధ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ మీట్ పరుగుపందాల్లో పలు కేటగిరీల నుంచి 60 పతకాలను సాధించినట్టు మంగళవారం ఆయన విలేకరులకు తెలిపారు. అనంతరం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని మర్యాదపూర్వకంగా కలిసి తాను సాధించిన బంగారు పతకాలను, సర్టిఫికెట్లను చూపించారు. నాగబాబును ఎమ్మెల్యే కొనియాడి అభినందనలుతెలిపారు.

ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు

'నన్నయ' విద్యార్థి వెంకటరమణ ఎంపిక



వెంకటరమణను అభినందిస్తున్న అధ్యాపకులు

దివాన్‌చెరువు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో వచ్చే నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాల ఆఖరి సంవత్సరం విద్యార్థి ఎస్.వెంకటరమణ ఎంపికైనట్టు వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రమణను వీసీ సన్మానించి వివరాలు తెలిపారు. నన్నయ వర్శిటీలో జరిగిన ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరంలో ఎంపికైన రమణ పదిరోజులు పూణేలో జరిగిన ప్రీఆర్‌డిలో చక్కటి ప్రతిభ కనబరచి గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఎంపికైనట్టు చెప్పారు. మన రాష్ట్రం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపిక కాగా వారిలో నన్నయ వర్శిటీ విద్యార్థి వెంకటరమణ ఉండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కార్యక్రమ కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు, ప్రోగ్రాం అధికారి ఎం.గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్ - 2 ఫార్మసిస్ట్ ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాల పరిధిలోని మెడికల్ అండ్ హెల్త్ జోన్ - 2 పరిధిలోని కాంట్రాక్టు గ్రేడ్ - 2 ఫార్మసిస్ట్ పోస్టులకు సంబంధించిన రివైజ్డ్ ప్రొవిజనల్ మెరిట్ లిస్టును మంగళవారం విడుదల చేశారు. ఈ మేరకు రీజనల్ డైరెక్టర్ పద్మా శశిధర్ ఒక ప్రకటన విడుదల చేశారు. లిస్టు జిల్లా ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో ఉంచడం జరిగిందని తెలిపారు. మెరిట్ లిస్టుకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు, ఫిర్యాదులను ఈనెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా తెలియజేయాలని సూచించారు.

శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్‌లో

కొనసాగుతున్న ఐటీ దాడులు

పెద్దాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. సుమారు 4రోజులుగా ఈ దాడులను ఐటీ అధికారులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఫ్యాక్టరీ, ఇళ్లు బంధువుల ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి ఆస్తులపై తనిఖీలు చేపట్టారు. పలు కీలక పత్రాలు, ఫైళ్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. అలాగే కంపెనీకి సంబంధించిన ఆడిటర్లు, లీగల్ అడ్వైజర్లు, దస్తావేజు లేఖర్లను విచారించినట్లు తెలిసింది. అర్ధరాత్రి వరకూ ఐటీ అధికారులు తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల యాజమాన్యం భారీగా పలు ప్రాంతాల్లో భూములు, వాణిజ్య స్థలాలు కొనుగోలు చేసినట్లు ఐటీ అధికారులు గుర్తించినట్టు సమాచారం. దీంతో అందుకు సంబంధించిన డాక్యు మెంట్లు, భూముల విలువ తదితర వివరాలను ఆరాతీస్తున్నట్టు తెలుస్తోంది. బ్యాంకు లాకర్లను సైతం తనిఖీ చేసినట్టు సమాచారం. ఐటీ అధికారులు ఇప్పటివరకూ ఎంతమేర తనిఖీలు చేశారు, ఎంత మొత్తంలో నగదు, బంగారు గుర్తించారు. లెక్కల్లో లేని డబ్బు ఎంత గుర్తిం చారు అనే విషయాలు మాత్రం అధికారికంగా వెల్లడించలేదు. ఇన్ని రోజులుగా ఐటీ సోదాలు జరగడంతో పెద్దాపురం పట్టణంలో ఇదే విషయం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా భారీగా బంగారం, లెక్కల్లో లేని నగదును ఐటీ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. లెక్కల్లో పలు వ్యత్యాసాలను గుర్తించినట్లు సమాచారం. దానికి సంబంధించిన వివరాలను ఐటీ అధికారులు ఆరాతీస్తున్నట్లు తెలుస్తోంది. ఎంతమేర బంగారం కొనుగోలు చేశారు..? ఎక్కడ కొనుగోలు చేశారు..? అనే విషయంపై సంబంధిత దుకాణాలను సైతం విచారణ చేయనున్నట్లు సమాచారం. శ్రీలలితా యాజమాన్యానికి సంబంధించిన గృహాల్లో నివాసం ఉంటున్న వారిని ఫ్యాక్టరీకి పిలిచి విచారించినట్లు తెలుస్తోంది. అలాగే ఈ దాడులు మరో రెండు రోజులు కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

'పదోన్నతుల సీనియారిటీ లిస్టును వెబ్‌సైట్‌లో పొందుపరిచాం'

కాకినాడ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ పరిధిలో గల మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల సీనియారిటీ లిస్టును deoeg.org వెబ్‌సైట్‌లో పొందుపరచినట్టు కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే సదరు అభ్యర్థులు కాకినాడ డీఈవో కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలలోపు సమర్పించాలని ఆయన చెప్పారు.

జేఎన్టీయూకేలో అంతర్గత బదిలీలు

జేఎన్టీయూకే, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వర్శిటీ ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు జేఎన్టీయూకేలోని పలువురు అధికారులకు అంతర్గత బదిలీలు చేస్తూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేయగా వీసీ సమావేశహాల్లో వారందరికీ వీసీ నియామక ఉత్తర్వులను అందజేశారు. స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతిగా విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ మాలోతు రమేష్‌ను స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా, ప్రొఫెసర్ కె.పద్మప్రియను స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా, ఏఎం ప్రసాద్‌ను ఐఎస్‌టీ, కె.రాముసు అడ్మిషన్స్ విభాగాల ఇన్‌చార్జి డైరెక్టర్లుగా నియమించారు. ప్రొఫెసర్ డి.కోటేశ్వరరావును బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సు బీవోఎస్ ఛైర్మన్‌గా, ఈసీఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బీటీ కృష్ణను ఎంటెక్ వీఎల్ఎస్ఐ ప్రోగ్రామ్ బీవోఎస్ ఛైర్మన్‌గా నియమిస్తూ సంబంధిత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారిని వీసీ మురళీకృష్ణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

19, 20న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు

పిఠాపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 19,20వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు జరగనున్నాయి. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 100మందికి పైగా బాక్సర్లు, మరో 50మంది కోచ్‌లు, టీమ్ మేనేజర్లు, టెక్నికల్ స్టాఫ్ హాజరుకానున్నారు. ప్రతిభ కనబరిచే బాక్సర్లను జనవరిలో ఉత్తరప్రదేశ్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని.. బాక్సర్లు, సహాయకులకు భోజన, వసతి ఏర్పాట్లు చేసినట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణరావు తెలిపారు.

ఏపీఎస్పీలో హోరాహోరీగా స్పోర్ట్స్‌మీట్

సర్పవరం జంక్షన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ప్రాంగణంలో గత 2రోజులుగా నిర్వహిస్తున్న యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మంగళవారం షార్ట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, లాంగ్ జంప్, హైజంప్, 200 మీటర్స్, 400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో రెట్టించిన ఉత్సాహంలో ఏపీఎస్పీ పోలీసులు పాల్గొన్నారు. 800 మీటర్ల పరుగు పందెం, 1500 మీటర్ల పరుగు పందెం (పురుషులు), క్రికెట్ పోటీలు, కబడ్డీ, టెన్నీస్ డబుల్స్ మహిళలు లెమన్ స్పూన్, టెన్నీకాయిట్ పోటీలు, త్రో బాలింగ్, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలు నిర్వహించగా ఏపీఎస్పీ బెటాలియన్ పోలీసులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. బుధవారం మూడోరోజు ముగింపు క్రీడలు జరుగుతాయని పోలీసులు తెలిపారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న పోలీసులు



లెమన్ స్పూన్ పోటీలో పాల్గొన్న మహిళలు

షర్మిల జన్మదిన వేడుకలు
అమలాపురం టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురం సర్దార్ భగత్‌సింగ్ పురపాలక సంఘం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. షర్మిల జన్మదిన వేడుకల కేక్‌ను సుభాషిణి కట్ చేశారు.

నగరంలో కాంగ్రెస్ వేడుకలు
మామిడికుదురు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. రాబోయే కాలంలో షర్మిలారెడ్డి ఆధ్వర్యంలో పార్టీకి రాష్ట్రంలో పూర్వ వైభవం వస్తుందన్నారు

డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నిక



గుబ్బల శ్రీనివాస్, చొల్లంగి సత్యనారాయణమూర్తి, ఆకాశం శ్రీను, వాసంశెట్టి రాజేశ్వరరావు, చిలుపూరి సుబ్బరాజు, పినిశెట్టి వెంకటస్వామి, బండారు వెంకన్నబాబు, దాట్ల గోపిరాజు

పి.గన్నవరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పి.గన్నవరం నీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా పొన్నమండ నీటి సంఘం అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్(టీడీపీ), వైస్ చైర్మన్‌గా పి.గన్నవరం నీటి సంఘం అధ్యక్షుడు చొల్లంగి సత్యనారాయణ మూర్తి ఎన్నికయ్యారు. ఈమేరకు ఎన్నికల అధికారి, జిల్లా హార్టికల్చర్ అధికారి బీవీరమణ, అసిస్టెంట్ ఎన్నికల అధికారి తహశీల్దార్ పి.శ్రీపల్లవి లు వారికి ధ్రువపత్రాలు అందించారు. ఈసందర్భంగా నూతన చైర్మన్, వైస్ చైర్మన్లను టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, కూటమి నాయకులు దుశ్శాలువాలు, పూలమాలలతో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ముప్పర్తి నాని, అనుసూరి పురుషోత్తం, సంసాని పెద్దిరాజు, తోలేటి సత్తి బాబు, మొల్లేటి శ్రీనివాస్, సుధా బాబ్జి, బోనం బాబు, సాగి సత్యనారాయణ, అడబాల యుగం ధర్, శేరు శ్రీనుబాబు, సీహెచ్ హేలీనా, పాల మూరి శ్యాంబాబు, చాగంటి స్వామి, యడ్ల ఏసు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి డీసీ చైర్మన్‌గా శ్రీనివాస్
అయినవిల్లి, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి):అయినవిల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా అయినవిల్లి నీటిసంఘం అధ్యక్షుడు కాకర శ్రీనివాస్(చిన్న శ్రీను) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి అన్యం రాంబాబు, తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. వాడపాలెం, పసుపల్లి, అయినవిల్లి, అనాతవరం, ముమ్మిడివరం నీటిసంఘాలు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకున్నారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా కాకర శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సరిపల్లి శ్రీనివాసరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కాట్రేనికోన డీసీగా ఆకాశం శ్రీను
కాట్రేనికోన, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన నీటి పంపిణీ సంఘం చైర్మన్‌గా ఆకాశం శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికలో డీసీ చైర్మన్‌గా శ్రీనివాస్‌ను, వైస్ చైర్మన్‌గా వాసంశెట్టి రాజేశ్వరరావును ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి సునీల్‌కుమార్ ప్రకటించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావు, కంచుస్తంభం కృష్ణ, నూకల మూర్తి, కముజు రాంబాబు, ఇసుకపట్ల వెంకటరమణ, కాలాడి వీరబాబు, నేలపాటి సంచలరావు, పిన్నమరాజుర రంగరాజు, మోకా లోవరాజు, సుంకర బుజ్జి, బండారు ఏసు పాల్గొన్నారు.

మురమళ్ళ డీసీ చైర్మన్‌గా సుబ్బరాజు
ఐ.పోలవరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ నీటి పంపిణీ సంఘం చైర్మన్‌గా కేశనకుర్రు నీటి సంఘం అధ్యక్షుడు చిలువూరి సుబ్బరాజు ఎన్నికయ్యారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నిక జరిగింది. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.



రాజులపూడి వెంకటేశ్వరరావు, దంగేటి వెంకటరెడ్డినాయుడు, గుత్తుల శ్రీనివాస్

వైస్ చైర్మన్‌గా జనసేనకు చెందిన టి.కొత్తపల్లి నీటి సంఘం చైర్మన్ చోడిశెట్టి నాగబాబు ఎన్నికయ్యారు. శానపల్లిలంక నీటి సంఘం చైర్మన్ జనసేనకు చెందిన గుద్దటి జమ్మి డీసీ పదవి కోసం పట్టుబట్టారు. ఆయనకు వైస్ చైర్మన్ ఇస్తామని చెప్పినప్పటికీ అంగీకరించలేదు. ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్లను ఎమ్మెల్యే అభినందించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, సాగిరాజు సూరిబాబురాజు, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, కాకర్లపూడి రాజేష్, దూళిపూడి చక్రం, చోడిశెట్టి బ్రహ్మానందం, పెంట రవి, పొత్తూరి సత్తిబాబురాజు పాల్గొన్నారు.

వైస్‌చైర్మన్ ప్రసాద్‌కు సత్కారం
అంబాజీపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అవిడి వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్‌చైర్మన్‌గా ఎన్నికైన కె.పెదపూడి నీటి సంఘం అధ్యక్షుడు అక్కిశెట్టి వెంకటతిరుపతి శివప్రసాద్‌ను కూటమి నేతలు ఘనంగా సత్కరించారు. అవిడిలో జరిగిన ఎన్నికల్లో వైస్‌చైర్మన్‌గా ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల అధికారి చేతులు మీదుగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, నాయకులు అరిగెల సూరిబాబు, అక్కిశెట్టి పెద్ద పాల్గొన్నారు.

అమలాపురం డీసీ అధ్యక్షుడిగా భీముడు
అమలాపురం టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అమలాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఆర్డీవో కె.మాధవి, ఏఈర్వోగా తహశీల్దార్ జీడీ కిశోర్‌బాబు వ్యవహరించారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు నామినేషన్లు స్వీకరించారు. ఆయా స్థానాలకు ఒక్కొక్కరే నామినేషన్లు దాఖలు చేశారు. అధ్యక్షుడిగా రాజులపూడి వెంకటేశ్వరరావు (భీముడు), ఉపాధ్యక్షుడిగా చింతపల్లి సూర్యనారాయణ ఎన్నికైనట్టు ప్రకటించారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రత్యేకంగా అభినందించారు.

రాజోలు డీసీ చైర్మన్‌గా పినిశెట్టి
రాజోలు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజోలు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా పినిశెట్టి వెంకటస్వామి(బుజ్జి), ఉపాధ్యక్షుడిగా ఆకన బాబ్జి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వీఎస్ఎస్ ప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. పొన్నమండ నీటిసంఘం అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ పి.గన్నవరం నీటిసంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా శ్రీనివాస్ రాజోలు సంత మార్కెట్ వద్ద నున్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీ కేతా శ్రీను, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటరమణ, ముదునూరి చినబాబు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. తాటిపాక, కడలి, పొదలాడ నీటిసంఘాల అధ్యక్షులు కడలి కృష్ణమోహన్, గాలిదేవర వెంకన్నబాబు, ఉలిశెట్టి లక్ష్మణరావు, గుబ్బల ఫణికుమార్, సూరిశెట్టి శ్రీనివాస్, కసుకుర్తి త్రినాథస్వామి, మాజీ వైస్ ఎంపీపీ అడబాల చంటి, ముత్యాల శ్రీను, అడబాల సూరిబాబు, రేకపల్లి దొరబాబు, మెరుగుమువ్వల సత్యవరప్రసాద్, కడలి వెంకటరమణారావు తదితరులు అభినందనలు తెలిపారు.

ఉప్పలగుప్తం చైర్మన్‌గా చిట్టిబాబు
ఉప్పలగుప్తం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన ఉప్పలగుప్తం నీటి పంపిణీ సంఘం అధ్యక్షుడిగా టి.చల్లపల్లి నీటి వినియోగదారుల సంఘం చైర్మన్ దంగేటి వెంకటరెడ్డినాయుడు (చిట్టిబాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా ఎస్.కొత్తపల్లి నీటి వినియోగదారుల సంఘం చైర్మన్ గుత్తుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వాసా దివాకర్ సమక్షంలో ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారి, రాజోలు హెడ్ వర్క్స్ డీఈ గంగుమళ్ల శ్రీనివాస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. డ్రెయిన్స్ ఏఈ సునీత సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, సర్పంచ్ నల్లా బాబండి, నీటిసంఘాల అధ్యక్షులు మోటూరి రవిశంకర్‌కుమార్, నల్లా సత్యనారాయణ, పోలిశెట్టి వెంకట ఉమామహేశ్వరరావు, కూటమి నాయకులు పలచోళ్ల పద్మనాభం, పోలిశెట్టి శివాజీ, పినిశెట్టి నరసింహారావు, గొలకోటి చిన్నా, యరగర్ర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అల్లవరం డీసీ చైర్మన్‌గా దాట్ల

అల్లవరం డీసీ చైర్మన్‌గా గోపీరాజు
అల్లవరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అల్లవరం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా కొమరగిరిపట్నానికి చెందిన టీడీపీ నాయకుడు దాట్ల గోపీరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా జనసేన నాయకుడు బండారు వెంకన్నబాబును నియమించారు. డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన దాట్ల, బండారులకు డీపీవో శాంతలక్ష్మి, తహశీల్దారు నరసింహారావులు ఎన్నిక ధ్రువపత్రాలను అందచేశారు. వారిని నీటి సంఘం అధ్యక్షుడు బొక్కా నాగశివప్రసాద్, గుర్రం రత్నప్రసాద్, సాధనాల నాగబాబుతో పాటు కంకిపాటి వీరబాబు, మంతెన సురేష్‌రాజు, సుంకర సాయి, తోట నరసింహరావు, పరసా కిరణ్, కడలి వెంకటేశ్వరరావు ఘనంగా సత్కరించారు.

రాష్ట్రాల హక్కులను హరిస్తున్న కేంద్రం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు కె.సుబ్బరావమ్మ

అమలాపురం టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరించి వేస్తూ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు కె.సుబ్బరావమ్మ ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుందని విమర్శించారు. కేంద్రం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బరావమ్మ మాట్లాడుతూ కేంద్రం తీసుకువస్తున్న జమిలి ఎన్నికలను సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థలను ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయడం లేదన్నారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆండ్ర మాల్యాద్రి, గుదే దుర్గాప్రసాద్, టి.నాగవరలక్ష్మి, నూకల బలరామ్, కె.కృష్ణవేణి మాట్లాడారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీపీఎం సీనియర్ నాయకుడు పచ్చిమాల వసంతకుమార్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.



సీపీఎం జిల్లా మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు సుబ్బరావమ్మ

గుండె వైద్య పరీక్షల యంత్రం మాయం

తిరిగి ప్రత్యక్షం..
కాంట్రాక్టు వైద్యుడు రాజీనామా

అమలాపురం టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఏరియా ఆసుపత్రిలో గుండె వైద్యానికి సంబంధించి డెఫీబ్రిల్లేటర్ యంత్రం గత నెలలో మాయమైంది. ఆసుపత్రిలో పనిచేస్తున్న వారే ఆ యంత్రాన్ని మాయం చేయడం, వారికి ఆసుపత్రి సిబ్బంది అండగా ఉండడం అనేక అనుమానాలకు తావిస్తుంది. చివరకు యంత్రం ఏరియా ఆసుపత్రిలో తిరిగి ప్రత్యక్షం కాగా సంబంధిత కాంట్రాక్టు వైద్యుడు డాక్టర్ కారెం రవితేజ రాజీనామా చేయడం దాన్ని ఉన్నతాధికారులు సైతం ఆమోదించడం జరిగిందని జిల్లా వైద్యసేవల సమన్వయకర్త కార్తీక్‌రెడ్డి మంగళవారం రాత్రి తెలిపారు. ఈవ్యవహారంపై ఇప్పటికే ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావుతో పాటు సంబంధిత వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. గత నెలలో యంత్ర పరికరం మాయం కాగా అదే నెలలో డాక్టర్ రవితేజ రాజీనామా చేయడం, తిరిగి ఈ నెల7న విధుల్లో చేరారు. ఆసుపత్రిలోని వైద్య పరీక్షలకు వినియోగించాల్సిన డెఫీబ్రిల్లేటర్ యంత్రాన్ని ఆసుపత్రి సెక్యూరిటీ గార్డు ప్రకాష్‌తో కలిసి మాయం చేసినట్టు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ పి.వీరబాబు ఫిర్యాదును స్వీకరించి ఆసుపత్రిలో విచారణ నిర్వహించారు. ఆ తర్వాత మాయమైన యంత్ర పరికరం ఆసుపత్రిలో ప్రత్యక్షమైంది. ఈ వ్యవహారంలో సమగ్ర నివేదిక ఇవ్వడం, సకాలంలో సంబంధిత ఉన్నతాధికారులకు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలియచేయకపోవడంతోనే షోకాజ్ నోటీసు జారీ చేశామన్నారు. డాక్టర్ రవితేజ రాజీనామాఆమోదం పొందగా అవుట్‌సోర్సింగ్ సిబ్బందిగా ఉన్న సెక్యూరిటీ గార్డు ప్రకాష్‌ను విధుల నుంచి తప్పించారు. ఈవ్యవహారంపై సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్టుసమన్వయకర్త డాక్టర్ కార్తీక్ తెలిపారు.



తిరిగి ప్రత్యక్షమైన డెఫీబ్రిల్లేటర్ యంత్ర పరికరం

ఫీల్డు అసిస్టెంట్ తొలగింపు
ముమ్మిడివరం, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): క్రాపచింతలపూడి పాలేనికి చెందిన ఫీల్డు అసిస్టెంట్ వి.వీరలక్ష్మిని విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తున్నట్టు డ్వామా పీడీ మధుసూదనరావు ఉత్తర్వులు జారీ చేశారు. మస్తర్లో అవకతవకలకు పాల్పడినట్టు, ఫీల్డుఅసిస్టెంట్ కుటుంబ సభ్యులకు వేర్వేరుచోట్ల వేర్వేరు జాబుకార్డులు కలిగి ఉన్నారని సర్పంచ్ చింతలపూడి ధననాగమణి అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ నిర్వహించిన అమలాపురం క్లస్టర్ ఏపీడీ నివేదికను సమర్పించారు. దీనిపై ఫీల్డు అసిస్టెంట్‌ను తాత్కాలికంగా తొలగిస్తూ పీడీ ఉత్తర్వులు జారీ చేశారు.

స్వామివారి గ్రామోత్సవం
అంతర్వేది, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా స్వామివారి వేకువజామున 4గంటలకు పంచామృతాలతో ఆర్జితాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారు పల్లకీలో మాఢ వీధుల్లో గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ధనుర్మాసం ప్రారంభం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామి-అమ్మవార్లను దర్శించుకున్నారు. పల్లకీలో ఊరేగుతున్న స్వామివారికి వీధుల్లో భక్తులు హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేశారు.

జనసేన నేత పండు కుటుంబానికి రూ.12 లక్షల సాయం
అమలాపురం రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జనసేన చేనేత వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు నాగపుల్లేశ్వరరావు (పండు) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. బండారులంకలో నిర్వహించిన సంతాప సభకు జనసేన పార్టీ క్రమశిక్షణా విభాగం చైర్మన్, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పండు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కోసం, పేద వర్గాల కోసం పండు అందించిన సేవలను వక్తలు కొనియాడారు. జనసేన ఆధ్వర్యంలో సేకరించిన రూ.12 లక్షల విరాళం చెక్కును పండు కుటుంబ సభ్యులకు అందజేశారు. నియోజకవర్గ నాయకులు నల్లా శ్రీధర్, యాళ్ల నాగసతీష్, కంచిపల్లి అబ్బులు, కల్వకొలను తాతాజీ, ఇసుకపట్ల రఘుబాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, యేడిద శ్రీను, లింగోలు పండు, మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, మాజీ ఎంపీటీసీ ఆశపు చిన్ని, ఆర్డీఎస్ ప్రసాద్, నల్లా వెంకటేశ్వరరావు, గటెం వీరు తదితరులు పాల్గొన్నారు.

గుడి నిర్మాణాన్ని కొనసాగించాలి
అమలాపురంరూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కామనగరువు అబ్బిరెడ్డివారి కాలనీలో నిర్మాణం చేపట్టిన గుడిని పూర్తిచేయాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులతో పాటు బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు రెండోరోజు మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. దీక్షా శిబిరంలో బజరంగ్‌దళ్ నాయకులు శిరంగు నాయుడు, ఊటుకూరి సాంబయ్య, మండపాక రజనీ, పోలిశెట్టి మంగాదేవి, గాలిదేవర ఉమ, రేళ్ల కృష్ణ, నిమ్మకాయల సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయా సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులను కలిసి కామనగరువు సబ్‌స్టేషన్ ఇన్‌చార్జి కల్పిస్తున్న అడ్డంకులను వివరించారు.

సత్యభాస్కర్‌కు ఉత్తమ రైతు అవార్డు


యానాం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): యానానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, వర్తకసంఘం గౌరవ అధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్ ఉత్తమ రైతు అవార్డుకు ఎంపికయ్యారు. వ్యవసాయ అనుబంధ రంగాల విభాగాల్లో ప్రతి సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన రైతులను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఏరువాక ఫౌండేషన్ ప్రతి సంవత్సరం వ్యవసాయ వార్షిక అవార్డులను ప్రకటిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్తమ ప్రతిభావంతులైన 34మందిని ఎంపిక చేయగా వరిసాగు పంటకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ నుంచిఇద్దర్ని ఎంపికచేశారు. యానానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మాజేటి సత్యభాస్కర్‌ని వరి సాగు పంటకు ఉత్తమ రైతుగా ఎంపికచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు యానాం, తాళ్లరేవు మండలం సుంకరపాలెంలో ఉన్న వ్యవసాయ భూముల్లో వరిలో అధిక దిగుబడులు సాధించడంతో పాటు విత్తనోత్పత్తికి కృషిచేశానన్నారు. త్వరలో విజయవాడలో జరిగే కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకోనున్నారు.

2900 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం
పి.గన్నవరం, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): తాటిపాక నుంచి రావులపాలెం రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న బోలేరో వాహనాన్ని సోమవారం అర్ధ రాత్రి దాటిన తరువాత త్రీరోడ్ సెంటర్‌లో స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. వాహనంలో రూ.1.16లక్షల విలువైన 2900కిలోల బియ్యం ఉన్నట్లు గుర్తించి సివిల్‌సప్లయి అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. మామిడికుదురు మండలం మగటపల్లికి చెందిన డ్రైవర్ కోదండసాయి దుర్గామణికంఠను అరెస్టు చేశామన్నారు. బియ్యాన్ని నగరం సివిల్ సప్లయి గోదాముకు తరలిస్తామని ఇన్‌చార్జ్ ఎంఎస్‌వో ఎండీఎన్ పూర్ణిమ చెప్పారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి
ముమ్మిడివరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కొమానపల్లి పంచాయతీ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో మంగళవారం తెల్లవారుజామున ఒక వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఇంట్లో నిద్రిస్తున్న గొల్లపల్లి సునీల్(43) మంగళవారం తెల్లవారుజామున ఫ్యాన్ స్విచ్చాఫ్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో సునీల్‌ను ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక వైద్యం అందించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం టి.కొత్తపల్లి సీహెచ్‌సీకి తరలించగా అతడు అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సునీల్‌కు ఇద్దరు కుమార్తెలు, భార్య విజయదుర్గ ఉన్నారు. కుమార్తెలు చదువుతున్నారు. సునీల్ కొమానపల్లి సెంటర్‌లో బజ్జీల దుకాణం ద్వారా జీవనం సాగిస్తున్నాడు. ఎస్ఐజ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

తాటాకిల్లు దగ్ధం
ముమ్మిడివరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం అన్నంపల్లి పంచాయతీ పరిధి చింతపల్లిలంకలో మంగళవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమై రూ.5లక్షలు ఆస్తి నష్టం ఏర్పడింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిన అగ్నిప్రమాదంలో మల్లాడి సత్తిబాబు, మల్లాడి సత్యనారాయణలకు చెందిన తాటాకిల్లు అగ్నికి ఆహుతైంది. ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

యాప్‌ల భారం తగ్గించి బోధనకే పరిమితం చేయాలి
మామిడికుదురు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు యాప్‌ల భారాన్ని తగ్గించి బోధనకే పరిమితం చేయాలని ఎమ్మెల్సీలు బొర్రా గోపీమూర్తి, యిళ్ల వెంకటేశ్వరరావులు పేర్కొన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ మామిడికుదురులోని ఎస్సీ సామాజిక భవనంలో మండలశాఖ అధ్యక్షుడు జి.నాగేంద్రప్రసాద్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సభలో ఉపాధ్యయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు మాట్లాడుతూ చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని హెల్త్‌కార్డులు మంజూరు చేయాలన్నారు.

నీటి సంఘాల్లో అన్ని వర్గాలకు స్థానం


కొల్నాడ సత్యనారాయణరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిరాజు, గిడ్డి, దేవ వరప్రసాద్

పి.గన్నవరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికల్లో అన్ని వర్గాలకు సముచిత స్థానం కూటమి ప్రభుత్వం కల్పించిందని ముమ్మిడివరం, గన్నవరం ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిరాజు, గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పి.గన్నవరం మండలం రాజులపాలెం గ్రామంలో ఇసుకపూడి నీటి సంఘం అధ్యక్షుడు కొల్నాడ సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి జరిగిన సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడారు. నీటి సంఘాలకు ఎన్నికైన అధ్యక్షులతో పాటు డీసీ చైర్మన్లు రైతులకు అందుబాటులో ఉంటూ సక్రమంగా సాగునీరందేలా చర్యలు చేపట్టాలన్నారు.

రాజోలు నియోజకవర్గానికి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి కేటాయించాలి

రాజోలు దివిలో సాగునీరు కాస్తా ఉప్పునీరులా తయారైందని, ఇరిగేషన్ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఇరిగేషన్ సిస్టమ్‌ను పూర్తిస్థాయిలో మార్పు చేయాలంటే రాజోలు నియోజకవర్గానికి ప్రాజెక్టు చైర్మన్ పదవిని కేటాయించాలని కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జ్ మంత్రితో జరగనున్న సమావేశంలో ఈవిషయాన్ని ఇన్‌చార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకునివెళ్తానన్నారు. నీటి సంఘం అధ్యక్షుడు సత్యనారాయణరాజును ఘనంగా సత్కరించారు. శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యేలు గిడ్డి సత్యనారాయణ, బుచ్చిరాజు, దేవ వరప్రసాద్‌లను గ్రామస్థులు, కూటమి నేతలు దశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. శిరిగినీడి వెంకటేశ్వరరావు, సంసాని పెద్దిరాజు, బొంతు పెదబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా,చొల్లంగి సత్తిబాబు, గణపతి వీరరాఘవులు, దొమ్మేటి సాయికృష్ణ, దంతులూరి శ్రీనురాజు, గుత్తుల చంటి, పేరిచర్ల నాగరాజు, నక్కా సునీల్, నాగాబత్తుల సుబ్బారావు, యడ్లపల్లి ఏసు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీలో అవకతవకలు
ఐ.పోలవరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ పంచాయతీ పరిధిలో వైసీపీ హయాంలో చేపట్టిన జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీలో భారీగా అవకతవకలు జరిగాయని ఆ గ్రామ మాజీ సర్పంచ్ చెయ్యేటి శ్రీనుబాబుతో పాటు పలువురు మంగళవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ సదస్సులో వినతిపత్రం సమర్పించారు. ఇతర ప్రాంతాల వారికి పట్టాలు ఇచ్చారని ఆరోపించారు. గ్రామానికి దూరంగా ఉన్న ఎర్రగరువు గ్రామంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. అయితే వారికి స్థలాలు చూపించలేదన్నారు. మురమళ్ళ జగనన్న లేఅవుట్‌లో రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని లబ్ధిదారుల నుంచి భారీగా వసూళ్ల చేసి అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. అప్పటి తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో వైసీపీ నాయకులతో కుమ్మక్కై పట్టాల పంపిణీలో అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు.

27నుంచి జాతీయస్థాయి ఉమెన్ బీచ్‌వాలీబాల్ పోటీలు
అమలాపురం టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల27 నుంచి ఎస్.యానం బీచ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి ఉమెన్ బీచ్ వాలీబాల్ పోటీల ప్రోమోను కిమ్స్ డైరెక్టర్ కె.రవికిరణ్‌వర్మ మంగళవారం ఆవిష్కరించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉమెన్ బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈపోటీల్లో కేరళ, గోవా, గుజరాత్, పుదుచ్చేరి, పశ్చిమబెంగాల్, ఒడిసా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన జట్లు పాల్గొంటాయని ఆనందరావు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, నల్లా స్వామి పాల్గొన్నారు.

ఒకే విధమైన పెన్షన్ విధానం అమలు చేయాలి
ముమ్మిడివరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశమంతా ఒకే రకమైన పెన్షన్ విధానం అమలు చేయాలని పెన్షనర్ల సమావేశం కోరింది. ముమ్మిడివరంలో విశ్రాంతి ఉద్యోగుల భవనంలో రెడ్డి వీరాస్వామి అధ్యక్షతన జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వరూప్ నకారా దేశంలో అందరికీ ఒకే రకమైన పెన్షన్ విధానాన్ని తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జరిగిన సభలో జనిపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ స్వరూప్ నకారా పెన్షనర్ల సంక్షేమానికి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి రామకృష్ణారావు, నేరేడుమిల్లి అబ్బులు, వాకా మధుసూదనరావు, బీర కృష్ణమూర్తి, కాకి సత్యనారాయణ, పల్లపు త్రిమూర్తులు, అవిడి వీరవెంకటసత్యనారాయణ, పితాని లక్ష్మణేశ్వరరావులతో పాటు పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

నూరుశాతం పన్నులు వసూలు చేయాలి
ముమ్మిడివరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నూరుశాతం పన్నులను సకాలంలో వసూలుచేసి నగర పంచాయతీ అభివృద్ధికి బాటలు వేయాలని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. ముమ్మిడివరంలో పన్నుల వసూళ్లకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇంటి పన్నుల వసూళ్లలో బకాయిలు ఉండడంతో కమిషనర్ రవివర్మ, రెవెన్యూ ఇనస్పెక్టర్ వి.భాస్కరరావు, ఆర్వో పీవీ నూకరాజులతో కూడిన బృందం ఇంటింటికీ తిరిగి వార్డు అడ్మిన్ సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్వో నూకరాజు, ఆర్ఐ భాస్కరరావు, వార్డు అడ్మిన్, సెక్రటరీలు ఉన్నారు.

నేడు కలెక్టరేట్‌లో డీఆర్సీ మీటింగ్
అముడా చైర్మన్ ప్రమాణ స్వీకారానికి రానున్న మంత్రి అచ్చెన్నాయుడు

అమలాపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం డీఆర్సీ మీటింగ్ నిర్వహించడానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొనే సమావేశంలో జిల్లాకు చెందిన మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజ్యసభ, పార్లమెంటు సభ్యులతో పాటు జిల్లాకు చెందిన శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నారు. జిల్లా డీఆర్సీ మీటింగ్‌లో జరిగే సమావేశ నిర్ణయాలను మీటింగ్ అనంతరం మీడియాకు మంత్రి వివరిస్తారని పౌరసంబంధాల శాఖ అధికారి లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం ఉదయం 7.30గంటలకు విజయవాడలో బయలుదేరి 11గంటలకు జిల్లా కేంద్రమైన అమలాపురం చేరుకుంటారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో జరిగే అమలాపురం అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు పదవీ ప్రమాణ స్వీకారంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు బయలుదేరి నల్లవంతెన సమీపంలో ఉన్న కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని అక్కడ జరిగే డీఆర్సీ మీటింగ్‌లో మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. సాయంత్రం 4.3 గంటల తర్వాత అమలాపురం పర్యటన ముగించుకుని రోడ్డు మార్గాన తిరిగి విజయవాడ బయలుదేరనున్నారు.

9వ రోజు నిరసనలో వంటా-వార్పు
అమలాపురం టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ సిబ్బంది డిమాండ్లను పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి తొమ్మిదో రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం ఎదుట వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్ ఇండోర్ అండ్ అవుట్‌డోర్ సిబ్బందికి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని నినాదాలు చేశారు. వంటా వార్పు నిరసనలో దంగేటి షణ్ముఖరావు, యెరుబండి వెంకటసత్యనారాయణ, సీహెచ్ తిరుమలకుమార్, మేడిద దుర్గా, నాగరపు శ్రీను, దంగేటి కృష్ణ, ఎస్.కాళీకృష్ణ, రాయుడు మనోహర్, సంసాని శంకర్, గంటి రమేష్, గిద్ద రమణ, ఎం.మధు తదితరులు పాల్గొన్నారు.

మహిళా, బాలికా సంరక్షణపై ప్రత్యేక దృష్టి

● ఎస్పీ కృష్ణారావు



పామర్రు పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

కె.గంగవరం, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళ, బాలికా సంరక్షణపై ప్రత్యే కదృష్టి పెట్టినట్లు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు చెప్పారు. మంగళ వారం ఆయన పామర్రు పోలీస్‌స్టేషన్‌లో విలే కరులతో మాట్లాడారు. స్టేషన్‌కు వార్షిక తనిఖీ నిమిత్తం వచ్చినట్లు చెప్పారు. స మాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను అదుపుచేయడానికి చేస్తున్న కృషిని వివరించారు. సైబర్ నేరాలబారిన పడ కుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూ చించారు. దీనికోసం ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ను ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పా రు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే పోగొట్టుకున్న సొమ్ము రికవరీకి, నేరస్తులను పట్టుకో వడానికి సమ యం పడుతుంది. అలాకాకుండా నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉంటే నష్టపో కుండా ఉంటారన్నారు. గ్రామాల్లో ప్రజల భాగ స్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వీటివలన నేరగాళ్లను తొందరగా పట్టుకునే అవకాశం ఉంటుందని ఈ పనిని వేగవంతం చేయాలని ఎస్.ఐ. జానీబా షాకు సూచించారు. స్టేష న్ రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట రామ చంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, మండపేట రూరల్ సి.ఐ. పి.దొరరాజులు ఉన్నారు.

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.12లక్షలు



విరాళం అందిస్తున్న దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో

ఆత్రేయపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మం గళవారం వేకువజామునే గోదావరి జలాలను తీ సుకువచ్చి స్నపనమూర్తులకు అభిషేకాలు నిర్వ హించారు. ధనుర్మాసం సందర్భంగా తిరుప్పావై వేదపారాయణం శాస్త్రోక్తంగా నిర్వహించి భక్త లకు దర్శనాలకు అనుమతించారు. వివిధ ప్రాం తాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి అష్టో త్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకు న్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వకుళమాత అన్న దాన భవన నిర్మాణానికి తాడేపల్లిగూడెంనకు చె ందిన ఊటుకూరి నాగలవకుమార్ రూ.50,116 విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా ఒ క్కరోజు ఆదాయం రూ.2,12,789 లభించినట్లు ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

అక్రమ చెరువు తవ్వకాలపై మత్స్యశాఖ జేడీ విచారణ



అక్రమ చెరువు తవ్వకాలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ జేడీ

ఆత్రేయపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజవరం గ్రామపరిధిలోని నిబం ధనలకు విరుద్ధంగా అక్రమ రొయ్యలచెరువు త వ్వకాలు సాగిస్తున్నారు. ఈనెల 14న రాత్రి వేళ ల్లో జోరుగా చెరువు తవ్వకాలు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై జిల్లా అధి కారులు తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు అదే ప్రాంతానికి చెందిన రైతు కమ్మ శ్రీనివాస రావు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, జిల్లా కలె క్టర్‌కు ఫిర్యాదుచేసిన విషయం విధితమే. మంగ ళవారం జిల్లా మత్స్యశాఖ జేడీ ఎన్.శ్రీనివాస రావు రాజవరం వద్ద సారవంతమైన భూము లలో చెరువు తవ్వకానికి ప్రయత్నించిన భూము లను ఆయన పరిశీలించారు. ఈమేరకు అక్రమ చెరువు తవ్వకాలపై ఫిర్యాదు చేసిన కమ్మ శ్రీనివాసరావు చెరువు భూముల వద్దకు చేరుకు న్నారు. ఆయన వెంట పిరమిడ్ జ్ఞానమందిరా నికి చెందిన సుమారు 50మంది అక్కడికి చేరు కున్నారు. స్థానిక రైతులు పిరమిడ్ సభ్యులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ విష యం తెలుసుకున్న సీఐ విద్యాసాగర్ అక్కడికి చేరుకున్నారు. పిరమిడ్ సభ్యులను అక్కడి నుం చి పంపించి వేశారు. ఇరువర్గాల మధ్య వాగ్వి వాదం చోటుచేసుకుంది. భూములలో తవ్వకా లకు సంబంధించి జేడీ పరిశీలించారు. ఆయన వెంట మండల మత్స్యశాఖాధికారి డేవిడ్‌రాజు ఉన్నారు.





ఆర్డీవో నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, ఆలమూరు డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా గోపాలస్వామి, గంగరాజు





రావులపాలెంలో గోపాలపురం డీసీ చైర్మన్ కరుటూరి నరసింహరావు, వైస్‌చైర్మన్ ఘైగావుల పుష్పావతులకు ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న ఆర్డీవో శ్రీకర్, కొత్తపేట డీసీ చైర్మన్ చవల జగన్నాథాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

ప్రశాంతంగా డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక

● ఏకగ్రీవంగా కూటమి అభ్యర్థుల ఎంపిక

రామచంద్రపురం డీసీ చైర్మన్‌గా నల్లమిల్లి

రామచంద్రపురం(ద్రాక్షారామ),డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల అధికారుల సమక్షంలో జరిగి న ఎన్నికల్లో నీటి సంఘాలకు చెందిన ప్రతినిధు లు డీసీ కమిటీలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎ న్నుకున్నారు. అన్ని స్థానాల్లోను ఎన్డీయే కూట మికి చెందిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. రామచంద్రపురం నీటి పంపిణీ సంస్థ చైర్మ న్‌గా పసలపూడికి చెందిన నల్లమిల్లి సత్యనారా యణరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళ వారం తహసీల్దార్ కార్యాలయంలో డీసీ ఎన్నిక జరిగింది. పసలపూడి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రామచంద్రపురం డీసీ అధ్య క్షుడిగా, రామచంద్రపురం నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు బిక్కిన జగన్నాధరావు ఏకగ్రీ వంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, ఆర్డీవో దేవరకొండ అఖిల తెలిపారు. ఏకగ్రీవగా ఎన్నికైన అధ్యక్షుడు నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, ఉపాధ్య క్షుడు బిక్కిన జగన్నాధరావులకు ధ్రువీకర ణ పత్రాలు ఆర్డీవో అఖిల అందజేశారు.

గోపాలపురం డీసీ చైర్మన్‌గా నరసింహరావు

రావులపాలెం: రావులపాలెం మండలం గోపా లపురం డీసీ చైర్మన్‌గా కరుటూరి నరసింహరావు, వైస్‌చైర్మన్‌గా ఘైగావుల పుష్పావతి ఎంపికయ్యా రు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిం చిన చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికల ప్రక్రియ ని ర్వహించారు. ఎన్నికల అధికారిగా పాల్గొన్న కొత్త పేట ఆర్డీవో శ్రీకర్ డీసీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. చైర్మన్ నరసింహరావు, వైస్‌చైర్మ న్‌గా పుష్పావతులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆలమూరు డీసీ అధ్యక్షుడిగా గోపాలస్వామి

ఆలమూరు: ఆలమూరు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలు ఏకగ్రీవంగా మంగళవారం ఆలమూరులో జరిగాయి. డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల కోసం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీసీ ఎన్నికల ప్రత్యేకాధికారి మ ధుసూదనరావు, తహశీల్దార్ ప్రకాష్‌బాబుల పర్య వేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. ఆలమూరు డీసీ అధ్యక్ష పదవి కోసం చొప్పెల్ల సాగునీటి సంఘం అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి నామినే షన్ దాఖలు చేశారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా మిగిలిన సభ్యులు గార పాటి శ్రీనివాస్, చెల్లుబోయిన శివప్రసాద్, వైట్ల గంగరాజు మద్దతు ప్రకటించడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మధుసూధనరావు ప్రకటించారు. అనంతరం ఉపాధ్యక్షుడిగా ఆల మూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు వైట్ల గంగ రాజు నామినేషన్ దాఖలు చేశారు. ఒకే నామినే షన్ కావడంతో గంగరాజు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ప్రకటించారు. డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన గోపాలస్వామి, గంగరాజులను పలు వురు అభినందించారు.

కోటిపల్లి డీసీ అధ్యక్షుడిగా విజయగోపాల్‌రాజ్

కె.గంగవరం: కోటిపల్లి డీసీ అధ్యక్షుడిగా కోల ంక నీటి సంఘం అధ్యక్షుడు దాట్ల విజయ గోపా ల్‌రాజ్ ఎన్నికయ్యారు. కోటిపల్లి డీసీ పరిధిలోని ఐదు నీటి సంఘాల అధ్యక్షులు దాట్ల విజయ గోపాల్‌రాజ్ (కోలంక), రాయుడు వెంకటరమణ (పల్లిపాలెం), గోపి సతీష్ (దంగేరు), తాడాల లోవరాజు(గంగవరం), ములకల విశ్వేశ్వరరావు (కోట)లు హాజరయ్యారు. కోలంక నీటి సంఘం అధ్యక్షుడు దాట్ల విజయగోపాల్‌రాజ్ డీసీ అధ్యక్షు డిగాను, గంగవరం నీటి సంఘం అధ్యక్షుడు తాడాల లోవరాజును డీసీ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. వీరికి ఎన్నికల అధికారి ఎస్.మురళీకృష్ణ ధ్రువపత్రాలు అందజేశారు. వీరిని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తం డ్రి సత్యం అభినందించారు. కూటమి నాయకులు మరివాడ సూరిబాబు, దేవరపల్లి బుల్లి, సలాది రమేష్, చలగళ్ల నాగేశ్వరరావు, గన్ని శ్రీనివాసు, మేడిశెట్టి రవికుమార్, అల్లూరి దొరబాబు, తరప ట్ల ఆనందరావు, సలాది శ్రీను పాల్గొన్నారు.

మండపేట డీసీ అధ్యక్షుడిగా పడాల

మండపేట: ఎన్నికల అధికారి డిప్యూటీ కలెక్టర్ కె.లక్ష్మీశివజ్యోతి(ఓఎస్డీసీ)ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా కుతు కులూరు నీటి సంఘం అధ్యక్షుడిగా పడాల వెంక టసుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పసల వేంకటేశ్వర రావు ఎన్నికయ్యారని ఆమె ప్రకటించారు. మంగళ వారం ఇరువురికీ ఆమె ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఇరిగేషన్ డీఈఈ కె.శ్రీనివాస్ మం డపేట మండల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ అజీజ్, కూటమినేతలు వారిని అభినందించారు.

కూళ్ళ డీసీ చైర్మన్‌గా శివప్రసాద్ ఎన్నిక

కపిలేశ్వరపురం: కూళ్ళ డీసీ చైర్మన్‌గా మండ లంలోని తాతపూడి గ్రామానికి చెందిన మేకా శివ ప్రసాద్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. ఎన్నికల అధికారిగా అమలాపురం జిల్లా ఫిష రీస్ అధికారి ఎన్.శ్రీనివాస్ వ్యవహరించారు. అంగర, తాతపూడి, మాచర, కూళ్ళ, ఎండగండి నీటివినియోగ దారుల సంఘం అధ్యక్షులు తాత పూడి డబ్ల్యుయుఎ(ఉవా) ప్రెసిడెంట్ మేకా శివ ప్రసాద్‌ను చైర్మన్‌గా, కె.గంగవరం మండలం అముజూరుకు చెందిన యనమల గోపాలకృష్ణను వైస్‌చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. డీసీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లను కూటమి నాయకులు అభినందించారు.

కొత్తపేట డీసీ చైర్మన్‌గా జగన్నాథం ఎంపిక

కొత్తపేట: కొత్తపేట డీసీ చైర్మన్‌గా ఎన్నికైన పలివెలకు చెందిన చవల జగన్నాథం, వైస్‌చైర్మ న్‌గా అక్కిశెట్టి వెంకటతిరుపతి శివప్రసాద్‌లు ఎన్నికయ్యారు. మంగళవారం వాడపాలెంలో జరి గిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు స్వగృహంవద్ద నియోజకవర్గంలో ఎన్నికైన నీటి సంఘం అధ్యక్షులను, డీసీ చైర్మన్లను ప్రత్యేకంగా దుశ్శాలువాతో ఎమ్మెల్యే సత్యానందరావు సత్కరిం చారు. కరుటూరి నరసింహరావు, చవల జగ న్నాథం, మెర్ల గోపాలస్వామి, రెడ్డి తాతాజీ, కంఠం శెట్టిశ్రీనివాస్, సాదే శ్రీనివాస్, గుబ్బల మూర్తి తది తరులు ఉన్నారు.



కె.గంగవరంలో ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణపత్రాలు అందుకుంటున్న అధ్యక్ష, ఉపాధ్యక్షులు విజయగోపాల్‌రాజ్, లోవరాజులు



మండపేట డీసీ కమిటీ అధ్యక్ష,ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సుబ్బారెడ్డి, వేంకటేశ్వరరావు



కపిలేశ్వరపురంలో ఎన్నికైన డీసీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లను అభినందిస్తున్న కూటమి నాయకులు

మున్సిపల్ అద్దె బకాయిలపై రగడ

● రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిలు

● కౌన్సిల్‌ను తప్పుదారి పట్టించినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

● విచారణ చేయకుంటే ప్రైవేటు కేసు వేస్తా : టీడీపీ కౌన్సిలర్ చుండ్రు



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



చైర్‌పర్సన్ నూక దుర్గారాణి

మండపేట, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మం డపేట మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లకు సంబం ధించి అద్దెల బకాయిలు కోట్లలో పెరుకుపోయినా అధికారులు కౌన్సిల్ దృష్టికి తీసుకురాకుండా కౌ న్సిల్‌ను తప్పుదారి పట్టించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అవకతవకలపై విచారణ నిర్వహించాలని సభ్యులు డిమాండ్ చేశారు. మం డపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళ వారం చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఎక్స్‌అఫీషి యో సభ్యుడు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హా జరయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన అధికా రుల దుకాణాలకు సంబంధించిన అద్దెలు కేవలం రూ.52లక్షలు మాత్రమేనని చెప్పి కౌన్సిల్‌ను తప్ప దారి పట్టించారని ఇపుడు అవే బకాయిలు రూ.352 కోట్లమేర పెరుకుపోయాయని వాటి వసూలుకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకున్నారని టీడీపీ కౌన్సిలర్ చుండ్రు చిను బ్బారావు అధికారులను కౌన్సిల్‌లో ప్రశ్నించా రు. ఈ అంశంపై తమను తప్పదారి పట్టించిన అధి కారులపై చర్యలు తీసుకోవటంతోపాటు న్యాయ విచారణ చేయాలని లేకుంటే తానే న్యాయస్థా నంలో కేసు వేస్తానని సుబ్బారావు హెచ్చరించా రు. మంగళవారం జరిగిన మున్సిపల్ సమావేశం పలు అంశాలపై వాడివేడిగా సా గింది. అద్దెలు అంశంపై ఇప్పటి కే పలు కేసులు న్యాయస్థానంలో వేశామని ఆర్వో శాస్త్రీ సమా ధానం చెప్పారు. ఇదే అంశంపై ఎమ్మెల్యే వేగుళ్ల కల్పించుకుని దీనిపై త్వరగా చర్యలు తీసుకుని అద్దెలు వసూలుకు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలులో జాప్యంచేసి ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో పట్టణంలో భూ దోపిడీకి పాల్ప డ్డారని వేగుళ్ల ఆరో పించారు. ఇప్పటికే చాలా కాలం అయి ంద ని ఎందుకు మాస్టర్ ప్లాన్ అమలు చేయలేదని దీనికి సంబంధించిన సంస్థలపై చర్యలు తీసు కోవాలని సభ్యులు డిమాండ్ చేయగా అలాంటి చర్యలు తీసుకునే అధికారం మనకులేదని పట్టణ ప్రణాళిక అధికారి శ్రీధర్ చెప్పారు. పట్టణంలో ఖాళీస్థలాల్లో పెరిగి పోతున్న పిచ్చిమొక్కలు కారణంగా తలెత్తుతున్న సమస్యలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల, సభ్యులు కోరారు. స్థల యజమానులకు నోటీసులు ఇవ్వటంతో బపాటు వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పట్టణంలో గాంధీనగర్‌లోవున్న కనకదుర్గ ఆల యం చెంతనే వున్న మున్సిపల్ స్థలంలో కమ్యూ నిటీహాలు నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపి ంది. ముస్లింషాదిఖానా నిర్మాణం పనులు మధ్యలో నిలిచిపోయిన నేపథ్యంలో రూ.55లక్షల నిధులతో పనులు పూర్తి చేసేందుకు కౌన్సిల్ ఆమోద ముద్రవేసింది. పట్టణంలో రోడ్డు మరమ్మతులు గురించి తమకు తెలియపరచాలని టీడీపీ కౌన్సి లర్ యారమాటి గంగరాజు కోరారు. మరమ్మతు పనుల్లో నాణ్యత లేకుండా పోతుంద ని ఆయన ఆరోపించారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ రబ్బాని రామచంద్రపురం న్యాయస్థానంలో ఇన్‌సాల్వెన్స్ పిటీషన్ దాఖలు చేసిన నేపథ్యంలో అతడిని అనర్హుడిగా ప్రక టించాలని టీడీపీ కౌన్సిలర్ యారమాటి గంగరాజు గత అక్టోబరు కౌన్సిల్ దృష్టికి తీసుకు వచ్చారు. దానిపై ఇన్‌సా ల్వెన్స్‌కు సంబంధించి కమిషనర్ రబ్బానికి నోటీ సును జారీచేయగా రబ్బాని తన కోఆప్షన్‌పదవికి కుటుంబ కారణాలు దృష్ట్యా రాజీనామా చేస్తున ్నట్టు అక్టోబరు 25న కమిషనర్‌కు సమర్పించారు ఈఅంశంను కౌన్సిల్ కు మంగళవారం తీసుకురాగా కౌన్సిల్ రాజీనామాను ఆమోదించింది. మండపేట పట్టణ ప్రజలకు అవసరమైన కరెంట్ ఫ్యూజ్‌కాల్ కార్యాలయం లేకపోవటంవల్ల కలుగు తున్న ఇబ్బందులు దృష్ట్యా పట్టణంలోని బూరు గుంట చెరువువద్దవున్న మున్సిపల్ షాపింగ్ కాప్లెంక్స్‌లో ఒకషాపును కేటాయించాలని కౌన్సిల్ నిర్ణ యించింది. పట్టణంలో నిర్మించిన క్రిస్టియన్ కమ్యూనిటీ హాలును ఈనెల 24న ప్రారంభిం చేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కోఆ ప్షన్ సభ్యుడు రెడ్డిరాధాకృష్ణ మాట్లాడుతూ పట్ట ణంలో మున్సిపల్ షాపింగ్ కాప్లెంక్స్‌కు సంబ ంధించిన దుకాణాలు పాడుకున్న వ్యాపారులు వేరేవారికి లాభాలకు దుకాణాలు సబ్‌లీజుకు ఇచ్చే అధికారం ఉందా అని కమిషనర్‌ను ప్రశ్నిం చగా అలాంటిదేమీ లేదని అలా చేస్తే వారి పాట ను రద్దుచేస్తామన్నారు. కౌన్సిల్‌లో పలు అంశాల పై చర్చించారు. పలు అభివృద్ధి పనులకు సం బంధించిన అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో కమిషనర్ రంగారావు, వైస్ చైర్మన్ లు వేగుళ్ల నారయ్యబాబు, పిల్లి గణేశ్వరరావు. మున్సిపల్ కౌన్సిలర్లతోపాటు మున్సిపల్ డీఈఈ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో 200 చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు కృషి

సర్పంచ్‌ల శిక్షణ తరగతులలో మంత్రి సుభాష్



శిక్షణా తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): రామ చంద్రపురం నియోజకవర్గంలో తొలివిడతగా 200 చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని మంత్రి సుభాష్ తెలిపారు. మంగ ళవారం రామచంద్రపురం మండల పరిషత్ కా ర్యాలయంలో రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ కార్యక్రమంలో సుస్థిరమైన అభివృద్ధి ప్రణాళిక లక్ష్యాలు స్థానికీకరణ అంశంపై గ్రామ సర్పం చ్‌లు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందికి రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణా తరగతులను మంత్రి సుభాష్ ప్రారంభిం చారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యసాధనలో ప్రతీ కుటుంబంలో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనేది సీఎం చంద్రబాబు ముఖ్యఉద్దేశమ న్నారు. అందుకు అనుగుణంగా డిసెంబరు 22న వీఎస్ఎం కళాశాల ప్రాంగణంలో 1054 చిన్న పరిశ్రమలకు సంబంధించి రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పనకు కార్యక్రమం ఏర్పాటు చేసి నట్లు వివరించారు. పరిశ్రమల స్థాపనకు సంబం ధించి అన్నిరకాల అనుమతులు, బ్యాంకులోన్లు మంజూరు చేయడానికి అనుభవజ్ఞులైన పది బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్థిక స్తోమత ఉండి పరిశ్రమల స్థాపనపై అవగా హన లేనివారు, పరిశ్రమలు స్థాపనపై ఆలోచన లు ఉండి ఆర్థిక స్తోమత లేనివారు కార్యక్రమా నికి హాజరై ఆలోచనలు పంచుకోవాలని సందే హాలు నివృత్తి చేసుకోవాలని కోరారు. ప్రతీ కు టుంబానికి ఒక పారిశ్రామిక వేత్తను తయారుచే యాలనే లక్ష్యం మేరకు నియోజకవర్గంలో 200 మందితో పరిశ్రమలు స్థాపించేందుకు చేస్తున్న కృషిలో ఇప్పటికే 40 మందిని ఎంపిక చేశామ న్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సెలట్ రాజు, కార్యాలయ పరిపాలనాధికారి చాగంటి సుబ్రహ్మణ్యం, మండలంలో సర్పంచ్‌లు, పంచా యతీ కార్యదర్శులు, మండల స్థాయి అధి కారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

ఆలమూరు: గ్రామాలను సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు వేయడానికి ఐక్యరాజ్య సమితి ఇచ్చిన సూచనలు పాటించి అభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్‌లు పనిచేయాలని ఎంపీపీ తోరాటి లక్ష్మ ణరావు, ఎంపీడీవో ఎ.రాజు అన్నారు. ఐక్యరాజ్య సమితి ఇచ్చిన అంశాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది అంశా లను రూపొందించి రాష్ట్రీయ గ్రామస్వరాజ్య అభి యాన్‌పై రెండురోజులు సర్పంచ్‌లకుశిక్షణా తరగ తులు ఆలమూరులో నిర్వహించారు. మంగళ వారం ప్రారంభించిన సందర్భంగా ఎంపీపీ లక్ష్మ ణరావు, ఎంపీడీవో రాజు ప్రసంగించారు.ఈ అం శాలపై పూర్తిస్థాయిలో వివరిస్తామన్నారు. కార్యక్ర మంలో ఎంఈవో సుబ్బరాజు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలపై శిక్షణ

ఆత్రేయపురం: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సుస్థిరమైన అభివృద్ధి, లక్ష్యాలపై మంగళవారం స్థానిక మండల పరిషత్, వెలుగు కార్యాలయంలో శిక్షణా తరగతులు నిర్వహిం చారు. ఎంపీడీవో వెంకటరామన్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. . సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచి వాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రణాళికతో ముందుకెళ్లాలి

రాయవరం: ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళితేనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎం పీడీవో ఎస్.కీర్తి స్పందన పిలుపునిచ్చారు. మంగ ళవారం రాయవరం మండల ప్రజాపరిషత్ కా ర్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్ర ణాళిక 2025-26పై గ్రామసర్పంచ్‌లు, సచివా లయ సిబ్బంది, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ ఎన్.శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్‌లు, సచివా లయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎల్ఎస్‌డీజీ సుస్థిరమైన, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ నిర్వహించారు. రెండురోజులపాటు జరిగే ఈశిక్ష ణలో తొలిరోజు నిర్వహించిన శిక్షణలో మండలం లోని సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సి బ్బంది పాల్గొన్నారు. మండలపరిషత్ కార్యాలయ ఏవో రాజేంద్రప్రసాద్, ఈవోపీఆర్డీ మోహన్, మండలస్థాయి అధికారులు, మండల ఇంజనీ రింగ్ అధికారి డీవీ రాఘవులు, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం

కొత్తపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామప్రజల వద్దకు వచ్చి వారి భూసమస్య లను పరిష్కారం చేయడమే ప్రభుత్వ లక్ష్య మని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానం దరావు అన్నారు. మండల పరిధి కండ్రిగలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే సత్యానందరావు, కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్ర బాబు ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశారని అలాగే రెవెన్యూ సదస్సుల ద్వారా సర్వే సమస్యలను పరిష్కరించి రైతుల భూములకు రక్షణ కల్పించడమే ముఖ్యఉద్దే శమన్నారు. కంఠంశెట్టి శ్రీని వాస్, రెడ్డి తాతాజీ, వాసంశెట్టి సత్యనారాయణ, గుబ్బల సత్తిపండు, గుడేల వెంకటేశ్వరరావు, దూన బోయిన అప్పారావు, కొప్పిశెట్టి వెంకటేశ్వర రావు, చోడే రాజారమేష్ పాల్గొన్నారు.

నెలాఖరుకి వరి నాట్లు పూర్తి చేయాలి

కె.గంగవరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): డిసెంబరు నెలా ఖరునాటికి రబీ నాట్లు ప్రక్రియ పూర్తి చేయాలని రామచంద్ర పురం వ్యవసాయశాఖ ఏడీఏ ఏ.వి.రంగా రావు అన్నారు. మంగళవారం యండగండి గ్రామంలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులతో మాట్లాడారు. వెదజల్లే విధానం ద్వారాకానీ, నాట్లువేసే విధానంద్వారా అయినా సరే ఈ నెలాఖరు నాటికి రబీ నాట్లు వేసే ప్రక్రియను పూర్తిచే యాలని రైతులకు సూచించారు. అదేవిధం గా రబీ పంటకు ఎకరాకు రూ.630లు చెల్లిం చి ఇన్సూరెన్స్ చేసుకోవాలని దీనివలన రైతు లకు విపత్తులు, ప్రకృతి వైపరీత్యాల వలన పంటకు నష్ట కలిగితే ప్రయోజనం కలుగు తుందని వివరించారు. వ్యవసాయశాఖ అధి కారి రవి, జి.లావణ్య, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లకు సత్కారం



ఎమ్మెల్యే వేగుళ్లను సత్కరిస్తున్న మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు

మండపేట, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును మంగళవారం జరిగిన ము న్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ రాణి, వైసీపీ కౌన్సిలర్‌లు, టీడీపీ కౌన్సిలర్‌లు ఘనంగా సత్కరించారు. వేగుళ్లను కౌన్సిల్ హాలులో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, మున్సిపల్ కౌన్సి లర్‌లు పాల్గొన్నారు.

బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవు

మండపేట, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి) బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్ప వని కార్మికశాఖాధికారులు పరిశ్రమలు, వ్యాపార సంస్థల నిర్వాహకులను హెచ్చరిస్తున్నారు. ప్రభు త్వ ఆదేశాల మేరకు మంగళవారం కార్మిక శాఖ, ఐసీడీఎస్, న్యాయవాదులు, పోలీసులు సంయు క్తంగా పట్టణంలో పలు ప్రాంతాలలో పర్యటించి బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే కలిగే ఇబ్బందులు గురించి వ్యాపారులకు పరిశ్ర మల నిర్వాహకులకు వివరించారు. రాజ మహేంద్రవ రం కార్మికశాఖ సహాయ అధికారి ఆధ్వర్యంలో పర్యటన సాగింది.

చలో కాకినాడకు తరలిరావాలి

● ఎమ్మార్పీఎస్ నాయకుల పిలుపు

మండపేట, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): ఈనెల 19న ఎస్సీ వర్గీకరణకోసం ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిషన్ కాకినాడకు వస్తున్న నేపథ్యంలో మాదిగ లంతా కాకినాడకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్రనాయకుడు దూళిజయరాజు మాదిగ పిలుపు నిచ్చారు. మండపేటలో మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ మాదిగలు వర్గీకరణకోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ 30ఏళ్ల నుంచి సుదీర్ఘపోరాటం చేస్తున్నారన్నారు. ఈనెల 19న కాకినాడలో కలెక్టర్ కార్యాలయంలో వర్గీకరణపై ఏకసభ్యకమిషన్ అధికారి రాజీవ్‌రంజన్‌మిశ్రా వచ్చి వినతులు స్వీకరిస్తారన్నారు. మాదిగ ఉపకూలాలకు చెందిన వారంతా కాకినాడకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభలు

కపిలేశ్వరపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండ లంలోని టేకి, నేలటూరు, కేదార్లంక గ్రామాల్లోని పంచా యతీ కార్యాలయాల వద్ద మంగళవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు కుక్కల నాగమణి, కుక్కల వీరన్న, వీధివెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామసభల్లో డీఆర్‌పి కృష్ణమూర్తి, ఉపాధికూలీల సమస్యలనడిగి తెలుసుకు న్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతీఒక్కరికీ 100 రోజుల పని కల్పించాలన్నారు. టేకిలో జరిగిన గ్రామసభలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, టీడీపీ నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు, మేట్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా సమ్మేటివన్ పరీక్షలు

కె.గంగవరం, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పాఠశాలల్లో జరుగుతున్న సమ్మేటివ న్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు తీసుకున్నామని సమగ్రశిక్ష సీఎంవో ఎం.సుబ్రహ్మణ్యం వెల్లడించారు. మంగళవారం కె.గంగవరం, దంగేరు, సత్యవాడ, పామర్రు ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పరీక్షలను ఆయన పరిశీలించారు. విద్యార్థులను పలు ప్ర శ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. మ ధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

రైతులు వెదజల్లు విధానం పూర్తిచేయాలి

రాయవరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా దాళ్వాపంటకు రైతులంతా పనులు పూర్తి చేసుకుని వెదజల్లు సాగు జరిపే రైతులంతా డిసెంబరు 31లోపు వెదజల్లు విధానం పూర్తి చేయాలని ఆలమూరు ఏడీఏ కె.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని పసలపూడిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించా రు. ఏడీఏ మాట్లాడుతూ రైతులకు ఎప్పటిక ప్పుడూ సలహాలు, సూచనలు ఇస్తూ మంచి దిగుబడులు సాధించేందుకు పొలంపిలుస్తోం ది కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సూచనలతో సమాజశ్రేయస్సు



సన్మాన గ్రహీతలతో మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు అనుభవం కలిగిన విజ్ఞులని వారి అనుభవాలు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడతాయని మంత్రి సుభాష్ అన్నారు. మంగళవారం రాత్రి రామచంద్రపురంలో విశ్రాంత ఉద్యోగుల సమా ఖ్య కార్యాలయంలో పెన్షనర్స్‌డే నిర్వహించారు. సభలో మంత్రి సుభాష్ పాల్గొని ప్రసంగించారు. కూట మి ప్రభుత్వం అన్నివర్గాల శ్రేయస్సుకు పాటుపడుతుందని తెలిపారు. ఈసందర్భంగా 30 మంది విశ్రాంత ఉద్యోగులను మంత్రి సుభా ష్ సత్కరించారు. సమాఖ్య అధ్యక్షుడు పట్నాల రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో పట్టణ ప్రముఖులు అడ్డూరి జగన్నాధవర్మ, గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, కనకాల వెంకటేశ్వరరావు, జిల్లా ఖజానా అధికారి రామ నా ాధం, రామచంద్రపురం ఖజానా అధికారి సుభాషిణి, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు మేనే జర్లు, సమాఖ్య గౌరవాధ్యక్షుడు వి.కామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టి.రాఘవరాజు, ఆర్థిక కార్య దర్శి పి.వి.ఎస్.ప్రసాద్, ఉపాధ్యక్షుడు అంపోలు సత్యనారాయణ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

● కొత్తపేట ఎమ్మె ల్యే బండారు

కొత్తపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పెన్ష నర్ల సమస్యలను సానుకూల దృక్పథంతో పరి ష్కరించేందుకు కృషిచేస్తానని కొత్తపేట ఎమ్మె ల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళ వారం పెన్షనర్ల దినోత్సవాన్ని సంఘ కార్యాల యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా జరిగిన సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులందరూ ప్రశాంత జీవితం గడపాలని వారి సమస్యలను పరిష్క రించేందుకు కృషిచేస్తానన్నారు. అనంత రం పెన్షనర్లు ఎమ్మెల్యేను దుశ్శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఖజానాధి కారి డి.రామనాధం, సంఘ అధ్యక్షుడు యేడిద సత్తిరాజు, ప్రధాన కార్యదర్శి అజ్జవరపు వెంకట సుబ్బారావు, నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి భాస్కరరావు, రెడ్డి తాతాజీ, కముజు శ్రీ ను, పి.హరిహరదేవళ్ళరాజు, మాకే నరసింహ మూర్తి తదితరులు ఉన్నారు.